ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
శుక్రవారం అక్టోబరు 4, 2024



జగమేలు తల్లికి కుంకుమార్చన



అమ్మ వారి ఉత్సవ విగ్రహాన్ని తెస్తున్న సీపీ రాజశేఖరబాబు, దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామారావు

త్రిపుర సుందరి.. త్రిలోక పావని..

- తొలిరోజు బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనం
- వేలాదిగా తరలివచ్చి దర్శించుకున్న భక్తజనం
- దుర్గమ్మకు స్వర్ణ కిరీటం అందజేసిన భక్తుడు



దివ్య హారతికి నీరాజనం



కమనీయం... నగరోత్సవం



శ్రీచక్ర నవావరణార్చన..



వందే.. మంగళకారిణీ..



జయజయహే మహిషాసురమర్దిని



ఈనాడు, ఈనాడు డిజిటల్ - అమరావతి, న్యూస్‌టుడే - ఇంద్రకీలాద్రి

ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి అంగరంగ వైభవంగా ఆరంభమయ్యాయి. తొలి రోజు ఉదయం 9 గంటల నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించారు. దుర్గమ్మ బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనం ఇచ్చింది. ఈ రూపంలో అమ్మవారిని దర్శించుకుంటే పూర్ణఫలం దక్కుతుందనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుకే ఉదయం నుంచి వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తొలిరోజు ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకూ 70 వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దుర్గమ్మకు ఓ అజ్ఞాత భక్తుడు రూ.2.50 కోట్ల విలువైన వజ్రాలు పొదిగిన బంగారు కిరీటం, ఆభరణాలను తొలిరోజు అందజేశారు. బాలా త్రిపుర సుందరీదేవిని మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, వంగలపూడి అనిత, కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, కామినేని శ్రీనివాస్, దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ తరలివచ్చి దర్శించుకున్నారు. భక్తులకు ఏర్పాట్లను కలెక్టర్ సృజన పర్యవేక్షించారు.



దండాలు.. దండాలూ.. అమ్మోరు తల్లీ

దుర్గమ్మా శరణు..



దారులన్నీ అమ్మవైపే..

నేడు గాయత్రీదేవి రూపం...

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం అమ్మవారు శ్రీగాయత్రీదేవి రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనుంది.

దర్శన వేళలు
ఉదయం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు



కోలాట వైభవం...



అమ్మకు నృత్య నీరాజనం..



ఇంద్రకీలాద్రి.. శోభాయమానం

ఆశలు పట్టాలెక్కాల.. పనులు పరుగులెట్టాల!

- విజయవాడ రైల్వేస్టేషన్‌లో సమస్యల కూత
- కుంటుపడిన ప్రగతి.. గత ప్రతిపాదనలు బుట్టదాఖలు

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే

దేశంలోనే ప్రధాన రైల్వేస్టేషన్లలో నాలుగో అతి పెద్ద రైల్వేస్టేషన్ అయిన విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధి పరంగా వెనకబడింది. పెరుగుతున్న ప్రయాణికులకు అనుగుణంగా ఇప్పటికే ప్లాట్‌ఫామ్‌లు పెంచాల్సి ఉన్నా ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం అయ్యాయి. గత ఐదేళ్ల వైకాపా పాలనలో విజయవాడ డివిజన్ అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. నిధులు, పెండింగ్ ప్రాజెక్టుల సాధనలో వైకాపా ఎంపీలు పూర్తిగా విఫలమయ్యారు. గతంలో ఎంపీలతో రైల్వే జీఎం నిర్వహించిన సమావేశంలో వారు ఇచ్చిన ప్రతిపాదనలన్నీ బుట్టదాఖలయ్యాయి. ప్రతి బడ్జెట్‌లోనూ డివిజన్‌కు మొండిచేయి చూపారు. తాజాగా శుక్రవారం ఎంపీలతో నిర్వహించే సమావేశంలోనైనా దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ప్రయాణికులు, ప్రయాణికుల సంక్షేమ సంఘాలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నాయి.

భద్రత.. పెంచాలండోయ్...

సమీకృత భద్రతా వ్యవస్థలో భాగంగా రైల్వేస్టేషన్ చుట్టూ ప్రహరీ నిర్మించడం, అత్యాధునిక భద్రతా వ్యవస్థలో భాగంగా స్టేషన్‌లో అన్ని ప్లాట్‌ఫామ్‌లలో అదనంగా మరో 150 వరకు సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలి. రైల్వే పార్సిల్ కార్యాలయంలో విమానాశ్రయం తరహాలో అత్యాధునిక స్కానర్లు ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఎలాంటి తనిఖీలు లేకుండానే పార్సిల్‌లో వచ్చిన వస్తువులను నేరుగా రైళ్లలోకి ఎక్కిస్తున్నారు. గతంలో దేశంలోనే పలు ప్రాంతాల్లో జరిగిన దుర్ఘటనలను దృష్టిలో పెట్టుకొని రైల్వేస్టేషన్‌కు మూడంచెల భద్రతా వ్యవస్థలో భాగంగా సమీకృత భద్రతపై రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపినా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు.

ఆగిపోవద్దు... సాగిపోదాం..

★ ప్రస్తుతం విజయవాడ రైల్వేస్టేషన్‌లో 10 ప్లాట్‌ఫామ్‌లు ఉన్నాయి. పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా మరో ఐదు ప్లాట్‌ఫామ్‌లు పెంచాలని ఇక్కడి అధికారులు ప్రతిపాదనలు పంపినా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. ప్లాట్‌ఫామ్‌ల సంఖ్య పెంచితే రైళ్లు ఔటర్‌లలో నిలిపే పరిస్థితి ఉండదు. ప్రస్తుతం రైళ్లు సకాలంలో విజయవాడకు చేరుతున్నా స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లు ఖాళీ లేక ఔటర్‌లలో ఎక్కువ సేపు ఆపేస్తున్నారు.





చౌరవ చూపితే ఆదాయం...

రూ.కోట్ల విలువైన రైల్వే స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయి. రాయనపాడు, సత్యనారాయణపురం, సింగ్‌నగర్‌లలో సుమారు 150 ఎకరాల వరకు రైల్వే స్థలాలు ఉన్నాయి. వీటిని వినియోగంలోకి తెస్తే రైల్వేకి ఆదాయం రావడంతో పాటు స్థలాలు ఆక్రమణలకు గురికావు.

ఒత్తిడి తగ్గించాలి...

★ రూ.150 కోట్ల వ్యయంతో పదేళ్ల కిందట నగర శివారులో శాటిలైట్ స్టేషన్లను నిర్మించినా ప్రస్తుతం వృథాగా ఉన్నాయి. గుణదల, రాయనపాడు, కృష్ణకెనాల్ జంక్షన్లను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెస్తే విజయవాడ రైల్వేస్టేషన్‌పై ఒత్తిడి తగ్గి ఆయా రైల్వేస్టేషన్ల నుంచి ప్రయాణికులు నేరుగా నగరానికి చేరుకోవచ్చు.

మనసుపెడితే మరికొన్ని...

★ ప్రయాణికులకు తక్కువ ధరకే ఆహార పదార్థాలు లభించే జనాహార్ క్యాంటీన్లను విజయవాడ రైల్వేస్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫారాలలో ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం రెండు ప్లాట్‌ఫామ్‌లలో మాత్రమే ఉన్నాయి. జనతా ఖానా కూడా అన్ని క్యాంటీన్లు, స్టాళ్లల్లో ఏర్పాటు చేయాలి. ★ విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఫస్ట్‌ఎయిడ్ సెంటర్ లేదు. ప్రయాణికులకు అనారోగ్య పరిస్థితి తలెత్తితే సమీప ఆస్పత్రులకు వెళ్లేలోపు ప్రాణాలు పోతున్నాయి. ఫస్ట్‌ఎయిడ్ సెంటర్ ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. ★ రైల్వే నిర్వహణ పనుల పేరుతో విజయవాడ మీదగా నడిచే రైళ్లను ఏడాదిగా రద్దు చేస్తూనే ఉన్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్పష్టమైన ప్రకటన చేయాలి.

మచిలీపట్నం ఎంపీ బాలశౌరి ప్రతిపాదనలు..



గుడివాడ, మచిలీపట్నం, విజయవాడ, భీమవరం, సవారీగుడెం, వీరవల్లి సెక్షన్లలో ఆర్వోబీల నిర్మాణం, ఎల్‌సీ నెంబరు 338లో ఆర్‌యూబీ నిర్మాణం, బందరు రైల్వేస్టేషన్ ఆధునికీకరణ, మోడల్ రైల్వేస్టేషన్‌గా మార్పు, గుడివాడ రైల్వేస్టేషన్ అభివృద్ధి, మచిలీపట్నం నుంచి నేరుగా తిరుపతికి ప్రత్యేక రైలు, గుడివాడ కేజీఆర్ కళాశాల వద్ద మినీ అండర్ బైపాస్ నిర్మాణం, గుడివాడ రైల్వేస్టేషన్ తూర్పువైపు కొత్త బుకింగ్ కౌంటర్ల ఏర్పాటు, తరిగొప్పల రైల్వేస్టేషన్‌లో ఎలక్ట్రానిక్ వెండింగ్ మెషీన్ ఏర్పాటు, తరిగొప్పల రైల్వే స్టేషన్‌లో రైలు నెంబరు 17255/172556కు హాల్టు సౌకర్యం, ఎల్ నెంబరు 9, 12, 14, 16, 20, 27, 31, 32, 28, 44 వద్ద ఆర్వోబీ, ఆర్‌యూబీల నిర్మాణం, సర్కార్ ఎక్స్‌ప్రెస్ నాగపట్టణం వరకు పొడిగింపు, వడ్లమన్నాడు, వీరవల్లి రైల్వేస్టేషన్లలో రైళ్లకు హాల్టు.. తదితర అంశాలను జీఎం దృష్టికి తీసుకెళ్లనున్నారు.

విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ప్రతిపాదనలు..



విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధికి నిధులు, పశ్చిమ నియోజకవర్గ పరిధిలో వరద ముంపునకు గురి కాకుండా వించిపేట, పాత రాజరాజేశ్వరి పేట, కబేళా, కేఎల్‌రావు నగర్ తదితర ప్రాంతాల్లో డ్రెయిన్ల నిర్మాణం, ఎల్‌సీ 7 మధురానగర్ పప్పులమిల్లు వద్ద ఆర్వోబీ, ఆర్‌యూబీ నిర్మాణం, ఎల్‌సీ 316 విజయవాడ, గుణదల మధ్య ఆర్వోబీ నిర్మాణం, రాజరాజేశ్వరి పేట కిమీ 434/20-22 వద్ద ఆర్‌యూబీ, ఆర్వోబీల నిర్మాణం, ప్రయాణికుల సౌకర్యార్థం కరోనా సమయంలో ఆపేసిన విజయవాడ, డోర్నకల్ రైలు పునరుద్ధరణ, మైలవరం, తిరువూరు, జగ్గయ్యపేట, నందిగామ ప్రజల సౌకర్యార్థం రాయపాడు రైల్వేస్టేషన్‌లో శాతవాహన గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టు సౌకర్యం, ఎల్‌సీ గేట్ 140 కొండపల్లి వద్ద ఆర్‌యూబీ, ఎల్‌సీ 147 వద్ద ఆర్వోబీ, ఎల్‌సీ 148 వద్ద ఆర్వోబీ, మచిలీపట్నం, యశ్వంత్‌పూర్ రైలును రోజూ నడపాలి. పూరి, తిరుపతి రైలుకు రామవరప్పాడులో హాల్టు, విజయవాడ రైల్వేస్టేషన్‌లో పార్సిల్ కార్యాలయం నుంచి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, ప్రస్తుతం అండర్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన రైల్వే రిజర్వేషన్, జనరల్ బుకింగ్ కౌంటర్లు తిరిగి ఒకటో నెంబరు ప్లాట్‌ఫామ్‌పైకి మార్పు, జగ్గయ్యపేట, మైలవరం పరిధిలో పలు ప్రాంతాల్లో ఆర్‌యూబీ, ఆర్వోబీల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలి.



అయిదేళ్ల పాపం.. అంతులేని శోకం!

ఈ చిత్రం పరిశీలించారా..? ఇదేదో సాగు నీటి చెరువు అనుకుంటే పొరపాటే..! అక్రమ మట్టి తవ్వకాలతో ఏర్పడిన చెరువులు..! ఇటీవల వర్షాలకు దాదాపు 10-15 మీటర్ల లోతులో నీరు నిలిచింది. విజయవాడ గ్రామీణం కొత్తూరు పరిధిలో ఒక వ్యక్తి ఈ గుంతల్లో పడి గురువారం గల్లంతయ్యారు. పోలీసులు, గజ ఈతగాళ్లు గాలించారు. ఇక స్థానికుల వల్ల కాలేదని ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రప్పిస్తున్నారు. ఇలాంటి గుంతలు కొత్తూరు, తాడేపల్లి, వేమవరం, వెలగలేరు, గన్నవరం మండలంలో పలు గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ ఉన్నాయి. కొత్తూరులోనే కాదు.. నందిగామ, కంచికచర్ల మండలాల్లో క్వారీ గుంతల్లో పడి విద్యార్థులు బలయ్యారు.

ఈనాడు, అమరావతి

ఉమ్మడి జిల్లాలో కృష్ణా నదిలో ఈతకు వెళ్లి గల్లంతైన వారి సంఖ్య.. దాదాపు 76 మంది వరకు ఉంది. గత అయిదేళ్లలో మృతి చెందిన వారి సంఖ్య. వీరిలో విద్యార్థులే ఎక్కువగా ఉన్నారు. కీసర, మున్నేరు నదుల్లోనూ ఈతకు వెళ్లి గల్లంతై విగత జీవులుగా లభించిన ఘటనలు ఉన్నాయి. దీనికి కారణం ఇసుకాసురుల అక్రమ తవ్వకాలు. విచ్చలవిడిగా తవ్విన గుంతలతో విద్యార్థులు, యువకులు, పశువుల పెంపకం దారులు... గుంతల్లో పడి మృత్యువాత పడిన సందర్భాలు ఉన్నాయి. దీనిపై జాతీయ హరిత ట్రిబ్యునల్ సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది. దీనికి రక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన యంత్రాంగం వాటిని విస్మరించింది. ఇది కేవలం కృష్ణా, మున్నేరు నదులకే పరిమితం కాలేదు.

విచ్చలవిడి తవ్వకాల వల్లే..

గత అయిదేళ్లలో విచ్చలవిడిగా తవ్వకాలు జరిపిన అక్రమ క్వారీ గుంతలకు వ్యాపించింది. కొన్ని లక్షల ఘనపు మీటర్ల మట్టి ఇష్టానుసారం తరలించడంతో ఏర్పడిన తటాకాలు.. ఇప్పుడు మృత్యుకుహరాలుగా మారాయి. అక్రమ క్వారీయింగ్‌ను అరికట్టగలిగితే.. సారవంత

మృత్యు కుహరాలుగా అక్రమ తవ్వకాల గుంతలు

భారీ తటాకాలుగా మారిన పచ్చిక బయళ్లు, పొలాలు



కొత్తూరు గ్రామ పరిధిలో అక్రమ మైనింగ్‌తో ఏర్పడిన చెరువులు

నేలలు ఇలా తయారయ్యేవి కావని పశువులకు సైతం పచ్చిక లేని మైదానాలు తయారయ్యాయని గ్రామస్థులు వాపోతున్నారు. ఇటీవల కంచికచర్ల మండలంలో క్వారీ గుంతల్లో పడి ముగ్గురు యువకులు మరణించిన ఘటన మరిచిపోక ముందే ఇప్పుడు విజయవాడ గ్రామీణం కొత్తూరు పరిధిలో సంఘటన చోటు చేసుకుంది.

చర్యలు శూన్యం..!

విజయవాడ గ్రామీణం, జి.కొండూరు, గన్నవరం మండలాల్లో వందల ఎకరాల్లో మట్టి తవ్వకాలు జరిగినా.. అధికార యంత్రాంగం చోద్యం చూసింది. ఒక్కరిపైనా చర్య తీసుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వ బంజరులతోపాటు గ్రామ కంఠాలు.. పచ్చిక బయళ్లు అక్రమార్కులు చెరబట్టారు. వందల ఎకరాల్లో తవ్వకాలు జరిపారు. నిబంధనలకు విరుద్ధంగా రెండు తాటి చెట్ల లోతులో తవ్వారు. నిబంధనల ప్రకారం గనుల శాఖ ఆధ్వర్యంలో క్వారీలు నిర్వహిస్తే.. తవ్విన ప్రాంతాన్ని తిరిగి పూడ్చాలి. కంకర కానీ ఇతర గనులు గానీ తవ్వకాలు జరిపితే.. వాటిని పూడ్చేయాలి. జిల్లాలో కంకర మెటల్ తప్ప ఇతర గనులు లేవు. గ్రావెల్ మట్టి తవ్వకాలే ఎక్కువ. పొలాల్లో, మెట్టప్రాంతాల్లో తవ్వకాలు జరిపి వాటి అలా వదిలేశారు.

అసైన్డ్‌నూ వదల్లేదు...

అసైన్డ్ భూములు సైతం లీజుకు తీసుకుని మట్టి తవ్వకాలు జరిపారు. ఎకరా ధర లీజుకు రూ.10-30 లక్షల వరకు తీసుకున్నారు. ఒక మీటరు లోతు తవ్వకాలకు ఒప్పందాలు చేసుకుని 10 మీటర్ల వరకు తవ్వకాలు జరిపి ఆ భూములు ఎందుకూ పనికిరాకుండా చేస్తున్నారు. ప్రస్తుతం అవి మృత్యుకుహరాలుగా మారాయి. పశువులు కూడా వీటిలో పడి చనిపోతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ మూడు మండలాల్లో రూ.కోట్ల విలువైన అక్రమ మైనింగ్‌పై ప్రభుత్వం మారినా చర్యలు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలోనూ, ఎన్జీటీలోనూ కేసు విచారణలో ఉంది. ఇలాంటి ప్రాంతాల్లో కనీసం రక్షణ చర్యలు హెచ్చరిక నామఫలకాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఎన్జీటీకి ఇచ్చిన నివేదికలో అధికారులు మాత్రం తగు చర్యలు తీసుకుంటున్నామనీ.. హెచ్చరిక బోర్డులు పెడుతున్నామనీ.. ముళ్ల కంచెలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎక్కడా వాటి ఆచూకీ లేదు.

విజిలెన్స్ విచారణ!

జిల్లాలో అక్రమ మైనింగ్‌పై విజిలెన్సు విచారణ ప్రారంభించింది. ప్రభుత్వం దీనిపై ఆదేశాలు ఇవ్వడంతో ఇతర జిల్లాల బృందాలు వచ్చి విచారణ చేపట్టాయి. బాపులపాడు మండలంలో నిర్వహించారు. విజయవాడ గ్రామీణం పాతపాడులో ఒక రోజు అక్రమ మైనింగ్ గుంతలను లెక్కలు తీశారు. ఇతర గ్రామాలకు పరిశీలన బృందాలు వచ్చి లెక్కలు తీయాల్సి ఉంది.

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం



పోలినాయుడు కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న నార్త్ ఎమ్మార్వో చింతా శిరీష

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : బుడమేరు వరదల్లో మృతి చెందిన కరుభక్త పోలినాయుడు కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారం అందించింది. గత నెలలో వచ్చిన బుడమేరు వరదల్లో.. పోలినాయుడు గల్లంతయ్యారు. 15 రోజుల తర్వాత అతని మృతదేహం లభ్యమైంది. బాధిత కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కును గురువారం నార్త్ తహసీల్దార్ చింతా శిరీష చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకుడు ఎరుబోతు రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెట్ ప్రారంభం



కండ్రికలో అయాన్ డిజిటల్ జోన్ కేంద్రంలో తమ హాల్‌టికెట్ నంబరు ఏ గదిలో ఉందో చూసుకుంటున్న అభ్యర్థులు

కానూరు, న్యూస్‌టుడే : ఉపాధ్యాయ అర్హత పరీక్షలు(టెట్) పరీక్షలు విజయవాడలో గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా 6 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్ష జరిగింది. పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థులను గంట ముందు నుంచే అనుమతించారు. దివ్యాంగులకు అదనంగా 50 నిమిషాల సమయం కేటాయించారు. ఉదయం సెషన్‌లో మొత్తం 1080 మంది విద్యార్థులకు గాను 930 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 1090 మందికిగాను 924 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలు ఈ నెల 21వ తేదీ వరకు జరగనున్నాయి. నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను డీఈవో యు.వి. సుబ్బారావు పరిశీలించారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అన్ని కేంద్రాల్లో పరీక్షను ప్రశాంతంగా నిర్వహించామని ఆయన తెలిపారు.



ఎస్వీటీ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో సుబ్బారావు

జాతీయ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీ ఆరంభం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని సీహెచ్ఆర్‌కే వీఎంసీ ఇండోర్ స్టేడియం, సాయి సందీప్ బ్యాడ్మింటన్ అకాడమీ (ఎస్ఎస్‌బీఏ)లో ఈ నెల 11వ తేదీ వరకు జరిగే 'యోనెక్స్ సన్‌రైజ్ కలగర నాగబాబు స్మారక ఆలిండియా సబ్ జూనియర్ (అండర్-15, 17) ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీ' గురువారం ఉత్సాహంగా ప్రారంభమైంది. ఈ నెల 7వ తేదీ వరకు మెయిన్ డ్రా క్వాలిఫైయింగ్ రౌండ్స్ జరుగుతాయని రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి పోలినేని అంకమ్మచౌదరి తెలిపారు. 8వ తేదీ నుంచి మెయిన్ డ్రా పోటీలు జరుగుతాయన్నారు. క్వాలిఫైయింగ్ రౌండ్స్‌లో దేశంలోని పలు ప్రాంతాల నుంచి సుమారు 1,100 మందికిపైగా షట్లర్లు హాజరయ్యారని పేర్కొన్నారు. వీరి నుంచి ఒక్కో కేటగిరీలో సింగిల్స్‌లో 32 మందిని, డబుల్స్, టీమ్ విభాగాల్లో 16 జట్ల చొప్పున మెయిన్ డ్రాకు అర్హత కల్పిస్తామన్నారు. క్వాలిఫైయింగ్ రౌండ్స్ తొలి రోజైన గురువారం బాలబాలికల అండర్-17, బాలుర అండర్-15 కేటగిరీల్లో తొలి రౌండ్ పోటీలు రెండు స్టేడియాల్లో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయని అంకమ్మ చౌదరి తెలిపారు.



స్టేడియంలో తలపడుతున్న క్రీడాకారులు

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -118 రిటైల్ ధర 140 చికెన్ విత్ స్కిన్ - 203, చికెన్ స్కిన్‌లెస్ - 231.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 126, 135, 146 చికెన్ విత్ స్కిన్ - 246 చికెన్ స్కిన్‌లెస్ - 256.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 595 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

కేడీసీఏ అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్రా క్రికెట్ సంఘం(ఏసీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి గుంటూరులో జరిగే అంతర్ జిల్లాల అండర్-14 క్రికెట్ టోర్నీలో పాల్గొనే జిల్లా జట్టును ఎం.రవీంద్రచౌదరి గురువారం వెల్లడించారు. జట్టులో డి.రోహన్‌శివ్(కెప్టెన్), టి.భాను చైతన్య(వైస్ కెప్టెన్), కె.తమన్ సాయి, ఎస్.హర్ష, నహీద్ చౌదరి, ఎ.మైఖేల్, డి.భానుచంద్ యాదవ్, బీవీఎంఎస్ సాయిరామ్, కె.సాయి ఆశ్రిత్, జి.సంజిత్, ఏఎల్ సాయి చరణ్ గణేష్, ఎస్.ధ్రువచంద్ర, పీవీ రామ్ కిరణ్, ఎం.రుత్విక్, జి.రుస్సెల్ రామ్, స్టాండ్ బైస్‌గా జి.సాయి సహర్ష్, ఎం.మోక్షజ్ఞ, ఎస్‌డీఎండీ ఉమర్, పి.చరణ్, ఎన్.హితీష్ సాయిలు ఎంపికయ్యారు. ఈ జట్టుకు ఎస్.రామ్‌కుమార్ (గాంధీ) కోచ్‌గా నియమితులయ్యారు.

వైద్యానికి వచ్చిన యువకుడి అదృశ్యం

సూర్యారావుపేట: మానసిక వైద్యం కోసం విజయవాడకు వచ్చిన యువకుడు అదృశ్యమైన ఘటనపై సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్, యాపలసింగారం గ్రామానికి చెందిన చెడపొంగు సుధాకర్ (34)కు మానసిక స్థితికి సరిగా లేదు. చికిత్స నిమిత్తం సూర్యారావుపేటలోని ఓ ప్రైవేటు మానసిక వైద్యశాలలో ఈ నెల ఒకటో తేదీన చేర్చారు. ఆయనతో పాటు భార్య స్వాతి ఉన్నారు. 2వ తేదీ డాక్టర్‌కు చూపించేందుకు గది నుంచి వెళ్లారు. ఇంతలో సుధాకర్ ఉన్నఫళంగా బయటకు వెళ్లిపోయారు. ఈ మేరకు సూర్యారావుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మా నాన్నలను బాగా చూసుకో అన్నయ్యా..

సోదరుడికి ఫోన్ చేసి క్వారీ గుంతలో దూకిన యువకుడు

గొల్లపూడి, న్యూస్‌టుడే: అమ్మానాన్నను బాగా చూసుకో అన్నయ్యా అంటూ యువకుడు క్వారీ గుంతలో నిలిచి ఉన్న నీటిలో దూకి గల్లంతయ్యాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ గ్రామీణ మండలం కొత్తూరుతాడేపల్లికి చెందిన కూరపాటి నాగరాజు(28) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ యజమాని వద్ద రూ.40 వేలు అప్పుగా తీసుకున్నాడు. యజమాని డబ్బు ఇవ్వమని అడుగుతున్నా నాగరాజు దగ్గర లేక వాయిదాలు వేస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురై గురువారం ఉదయం సోదరుడు సుబ్బారావుకు ఫోన్ చేసి డబ్బులు కావాలని అడగ్గా ప్రస్తుతం తన వద్ద లేవని తర్వాత ఇస్తానని చెప్పాడు. దీంతో గ్రామంలో మట్టి తవ్వకాలు చేపట్టిన క్వారీ వద్దకు వెళ్లి సోదరుడికి ఫోన్ చేసి కుటుంబసభ్యులను చక్కగా చూసుకోవాలని చెప్పి ఫోన్ పెట్టేశాడు. వెంటనే సోదరుడు అక్కడికి వెళ్లి చూడగా చెప్పులు, చరవాణి కనిపించాయి. పోలీసులకు సమాచారం ఇవ్వగా వాళ్లు, అగ్నిమాపక శాఖ సిబ్బంది వచ్చి క్వారీ నీటిలో పరిశీలించినా ఆచూకీ తెలియలేదు. దాదాపు 50 అడుగులు పైగా మట్టి తవ్వకాలు చేపట్టడంతో కిందకు దిగే పరిస్థితి లేకుండా పోయింది. అనంతరం ఎస్డీఆర్ఎఫ్ బృందానికి సమాచారం ఇచ్చారు. చీకటి పడడంతో గాలింపు చర్యలు అనుకూలించలేదు. శుక్రవారం ఉదయం గాలింపు చేపట్టే అవకాశం ఉంది.



నాగరాజు ఆచూకీ కోసం క్వారీ వద్దకు వచ్చిన గ్రామస్థులు

మెగా ఫుడ్ బిజినెస్ ప్రదర్శన

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: ఈ నెల 4, 5, 6 తేదీల్లో విజయవాడ లబ్బీపేటలోని ఎస్.ఎస్.కన్వెన్షన్‌లో మెగా ఫుడ్ బిజినెస్ ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వి.స్వామి అన్నారు. గురువారం ఎస్.ఎస్.కన్వెన్షన్‌లో బ్రోచర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రెస్టారెంట్స్ పెట్టాలనుకునే వారికి వివిధ పరికరాలు, హోమ్ అప్లైన్సెస్, ప్యాకింగ్, సీలింగ్ మెషినరీ, ఆయిల్స్, మసాలాస్, పికిల్స్, పాల ఉత్పత్తులు, ఎండు ఫలాలు, బేకరితో పాటు వివిధ ఉత్పత్తులను 120 స్టాల్స్‌లో ప్రదర్శిస్తారని వెల్లడించారు. ఈ నెల 6న రాత్రి 9.30 వరకు మాత్రమే ప్రదర్శన ఉంటుందని, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మూత్రపిండాల వ్యాధితో మహిళ మృతి



గుగులోతు సోమిలి

వినగడప(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని వినగడప శివారు తండాలో గుగులోతు సోమిలి(58) మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ గురువారం వేకువ జామున మరణించింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు సోమిలీ భర్త కేశ్యా కూడా ఈ వ్యాధితోనే 2011లో మృతి చెందగా 2014లో ఈమె వ్యాధి బారిన పడింది. అప్పటి నుంచి విజయవాడలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో రూ.లక్షలు ఖర్చు చేసి చికిత్స తీసుకుంటోంది. వ్యాధి తీవ్రం కావడంతో గురువారం మృతిచెందింది. నెల రోజుల కిందట కూడా తండాలో ఇదే సమస్యతో ఒకరు మరణించారు. దీంతో తండా ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ సృజన ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు మూత్రపిండాల వ్యాధిపై సమగ్ర సర్వే చేశారు. సంబంధిత వివరాలను అధికారులు వెల్లడించాల్సి ఉంది.

రాష్ట్ర స్థాయి ఆత్యా-పాత్యా పోటీలకు జిల్లా జట్టు



క్రీడాకారులతో ఎంపిక కమిటీ సభ్యులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నెల్లూరు జిల్లా నవాబ్‌పేటలోని బీవీఎస్ మున్సిపల్ బాలికోన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 5, 6వ తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ (అండర్-14) బాలబాలికల ఆత్యా-పాత్యా ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే జిల్లా జట్టును గురువారం జిల్లా సంఘం కార్యదర్శి ఆర్.శ్రీ చరణ్ తెలిపారు. క్రీస్తురాజుపురంలోని క్రిస్ట్ ది కింగ్ ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన జిల్లా జట్టు ఎంపిక పోటీల నుంచి ప్రతిభగల క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు.

ఎంపికైన జట్టు సభ్యుల వివరాలు

బాలుర జట్టు: కె.ఆనంద్, డి.అశ్వంత్, జి.కౌశిక్, జి.యశ్వంత్, వై.అమన్, ఎ.రాజేష్, ఎం.జోజేష్, ఎం.అఖిల్, బి.యశ్వంత్, బి.లోకేష్ నంద అకిల్, ఎం.ప్రవల్, ఎ.దర్శన్, ఈ జట్టుకు కె.కిరణ్ కోచ్‌గా, యు.శ్రీనివాస్ మేనేజరుగా నియమితులయ్యారు. **బాలికల జట్టు:** పి.దుర్గ, కె.హేమంత, ఎస్.సంజన, ఎ.సోనాలిక, ఎం.అభిజ్ఞ, కె.కీర్తన, సీహెచ్ గౌతమి, జి.మనోజ్ఞ, జి.నిఖిత, వి.మాధురి, వై.సహాన, ఎన్.అక్షయ. ఈ జట్టుకు ఎం.గోపాల్ కోచ్‌గా, కె.షర్మిల మేనేజరుగా నియమితులయ్యారు.

ప్రాంగణ ఎంపికల్లో పీవీపీ సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో పాలడుగు లక్ష్మణరావు, శివాజీబాబు తదితరులు

కానూరు, న్యూస్‌టుడే : ప్రఖ్యాత బహుళజాతి సంస్థ యాక్సెంచర్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో పీవీపీ సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు 212 మంది ఎంపికై ప్రతిభ చూపారని ప్రిన్సిపల్ కొండపల్లి శివాజీబాబు తెలిపారు. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ప్రత్యేకంగా కోడింగ్, ఇతర నైపుణ్యాలలో శిక్షణ ఇవ్వడం వలన ఈ ఘనత సాధించగలిగారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, ప్రాంగణ ఉపాధి అధికారి రమేష్ తదితరులు అభినందించారు. కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులతో పాటు అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

లారీలకు అనుమతి లేదు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా విజయవాడలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న క్రమంలో ఈనెల 3వ తేదీ నుంచి ఉత్సవాలు ముగిసే వరకు గుంటూరు నుంచి విజయవాడ వైపునకు వెళ్లే చిన్న, పెద్ద లారీలకు అనుమతిలేదని ఎస్పీ సతీష్‌కుమార్ గురువారం తెలిపారు. గుంటూరు నుంచి విజయవాడ వైపుగా హైదరాబాద్‌కు వెళ్లే లారీలు పేరేచర్ల జంక్షన్ నుంచి సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదుగా, గుంటూరు నుంచి విశాఖపట్నం వైపునకు బుడంపాడు జంక్షన్ వద్ద నుంచి తెనాలి, వేమూరు, కొల్లూరు, పెనుముడి బ్రిడ్జి, అవనిగడ్డ, పామూరు, గుడివాడ, హనుమాన్‌జంక్షన్ మీదుగా వెళ్లాలని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 85005 44088 మైలవరం: 80085 74705

? కూనవరాజుపర్వ దక్షిణ బజారు నుంచి రెడ్డిగూడెం వైపు వచ్చే రహదారి మార్జిన్లలో చెత్త, వ్యర్థాలు వేయడంతో దుర్గంధం వెదజల్లుతుంది.
- స్థానికుడు శ్రీను

✔ చెత్త తొలగించేలా చర్యలు తీసుకుంటాం.
- ఎం.భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి.
- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

? కొండపల్లి నుంచి కోటకు వెళ్లే ప్రధాన మార్గం జాతీయ రహదారిపై ఎగువ నుంచి మురుగు నీరు వచ్చి చేరుతుంది. ఇబ్బందులు పడుతున్నాం.
- నాగరాజు, స్థానికుడు.

✔ ఎగువ నుంచి వచ్చే మురుగు నీటితో పాటు తాగునీటి పైపులైన్ నీళ్లు అక్కడకు చేరుతున్నాయి. దాంతో మురుగు ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తుంది. అక్కడి పరిస్థితిని మెరుగుపరుస్తాం.
- పవన్, పారిశుద్ధ్య మేస్త్రీ.
- న్యూస్‌టుడే, కొండపల్లి

ఎంపీడీవోగా సునీతశర్మ

ఇబ్రహీంపట్నం(గ్రామీణం), ఇబ్రహీంపట్నం: పెనుమలూరు మండలంలో ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న సునీతశర్మ ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం ఎంపీడీవోగా బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆమె గురువారం గొల్లపూడిలో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు.

విగ్రహ ప్రతిష్ఠా వార్షికోత్సవం

పెనుగొలను (గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలనులో శిర్డీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠా వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. సాయిబాబా వెండి ప్రతిమకు భక్తులు 54 కిలోల పంచదారతో అభిషేకం చేశారు. అనంతరం శిర్డీసాయిబాబా, సత్యసాయిబాబా చిత్రపటాలకు పల్లకీ సేవ చేశారు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం

నిత్యావసరాల అందజేత

గత వరదల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న లంక గ్రామ ప్రజలకు ఏపీఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు గురువారం నిత్యావసరాలు అందజేశారు. ఎన్టీటీపీఎస్ ముఖ్య ఇంజినీర్ నాగరాజు, సూపరింటెండెంట్ ఇంజినీర్లు ప్రసాద్, సత్యప్రసాద్, పాపారావు, కాంతారావు, కళ్యాణ్‌కుమార్, ఉమా విజయ్‌చంద్, సాల్మన్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.
- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం



ఎన్ఎంయూఏ ఉద్యోగుల నిరసన

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు ఆర్టీసీ డిపోలో సిస్టం సూపర్‌వైజర్ యూనియన్ కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని ఆరోపిస్తూ ఎన్ఎంయూఏ ఉద్యోగులు గురువారం ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. నాయకులు డీవీ రావు, ఎస్ఎన్.కుమార్, జీఎస్‌బీపీ రావు, జీఆర్ నాథ్, రాజా ఆధ్వర్యంలో ఆందోళనలో పాల్గొన్నారు.

పోగుచేయ్.. అమ్మేసెయ్

బుడమేరులో మేటేసిన ఇసుకపై అక్రమార్కుల కన్ను

మైలవరం, న్యూస్‌టుడే: భారీ వర్షాలతో నియోజకవర్గం అతలాకుతలం కాగా, బుడమేరులో మేటేసిన ఇసుక అక్రమాలకు 'వరదా'యినిగా మారింది. దశాబ్దాల నుంచి ఎక్కడికక్కడ ఆక్రమణల చెరలో చిక్కుకున్న వాగులకు, భారీ వరద రావడంతో ఆక్రమణలను ముంచి మేటలతో నిండాయి. నియోజకవర్గంలో బుడమేరు పరివాహక ప్రాంతంగా ఉన్న దాదాపు 35 కి.మీ మేరకు ఎక్కడ చూసినా ఇసుకే కనిపిస్తుంటే అక్రమార్జనదారులను ఊరిస్తోంది. అధికారుల దాడులతో కొంత సద్దుమనిగినట్లు కన్పిస్తున్నా, అర్ధరాత్రి దాటాక, కొన్నిచోట్ల పొలాల నుంచి తోలకాలు సాగుతున్నాయన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి.


రెడ్డిగూడెం కోతులవాగులో ఇసుక కోసం ట్రాక్టర్ల జాతర (పాతచిత్రం)

ఎటు చూసినా మేటలే

నియోజకవర్గంలోని రెడ్డిగూడెం, మైలవరం, జి.కొండూరు మండలాల్లో పూర్తిస్థాయిలో, ఇబ్రహీంపట్నం మండలంలో పాక్షికంగా బుడమేరు వాగు ప్రవహిస్తోంది. దానికి అనుబంధంగా అనేక వాగులు ఉండగా, గత నెలలో భారీ వర్షాలకు ఆ వాగులన్నీ పొంగి ప్రవహించాయి. అతి పెద్ద వాగుగా ఉన్న బుడమేరులోని రెండు పాయల్లో ప్రస్తుతం ఏ గ్రామంలో చూసినా పెద్ద ఎత్తున పేరుకున్న ఇసుక మేటలే కన్పిస్తున్నాయి. ఇంతటి ఇసుకను దాదాపు 30 ఏళ్ల తర్వాత చూస్తున్నామని పల్లెల్లో ప్రజలు చెబుతున్నారు. దాదాపు ఆయా గ్రామాల్లో కొందరు, వరదలు తగ్గగానే తవ్వకాలకు తెరలేపారు.

ట్రాక్టరు రూ.3 వేలు పైమాటే

మైలవరం మండలం, జి.కొండూరు మండలంలోని పలు గ్రామాల నుంచి గడిచిన నెలలోనే వేలాది ట్రిప్పుల ఇసుకను యంత్రాలతో తవ్వి, తరలించారు. ఒక్కో ట్రిప్పునకు రూ.3 వేలకు పైగా వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ★ రెడ్డిగూడెం కోతులవాగుకు ఒకే రోజు 100 ట్రాక్టర్ల వరకు పరుగులు పెట్టాయంటే ఇసుకను ఎంతగా ఒడిచి పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. ★ మైలవరంలో తోలకాల్లో తేడాలతో వర్గాలుగానూ మారి, రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పోలీసులకు పట్టించేస్థాయికి చేరారు. అప్రమత్తమైన పోలీసులు, డివిజన్ అధికారి ఆదేశాలతో రాత్రి గస్తీ పెంచడంతో కొంత మేర రవాణా తగ్గింది. ★ నియోజకవర్గ వ్యాప్తంగా చాటుమాటుగా ఇసుక తరలిస్తుంటే, జి.కొండూరు మండలం కుంటముక్కల నుంచి స్వేచ్ఛగా అమ్ముతున్నారని ప్రైవేటు ట్రాక్టర్ల నిర్వాహకులు బహిరంగంగానే చెబుతున్నారు.


మైలవరంలో బుడమేరు వాగు అంచున పోగేసిన ఇసుక

ప్రైవేటు నిర్మాణాలకు బుక్ చేసుకోవాలి: జి.బాలకృష్ణారెడ్డి, తహసీల్దార్, మైలవరం

ప్రైవేటు నిర్మాణాలకు ప్రభుత్వం సూచించిన క్వారీల నుంచి బుకింగ్ ద్వారా తెచ్చుకోవాలి. ప్రభుత్వ నిర్మాణాలకైతే సంబంధింత శాఖల నుంచి అంచనాలు, అనుమతులతో తరలించవచ్చు. అయితే అడ్డగోలుగా తవ్వుతున్నారన్న ఫిర్యాదుల మేరకు దాడులు చేసి వాహనాలకు జరిమానాలు విధిస్తున్నాం. అక్రమంగా తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తాం.

చెస్ పోటీల్లో ప్రతిభ

మైలవరం, న్యూస్‌టుడే: లిటిల్‌చాంప్స్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎస్‌కే ప్లే స్కూల్‌లో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి చెస్ పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 100 మంది క్రీడాకారులు పాల్గొనగా కొల్లా భావన్ (ప్రథమ), చరిత్‌సాయి (ద్వితీయ), బాలికల విభాగంలో రాచపూడి హంసిక (ప్రథమ), పి.గీతిక (ద్వితీయ) స్థానాలు సాధించినట్లు టోర్నమెంటు డైరెక్టర్ ఆదూరి సురేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌కే కరస్పాండెంట్ గొల్లపూడి శ్రీభావన, చెస్ సంఘం జిల్లా కార్యదర్శి మందుల రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీఆర్‌సీఈకి ఎడ్యుస్కిల్స్ అవార్డు

మైలవరం, న్యూస్‌టుడే: ఏఐసీటీఈ నిర్వహించిన ఎడ్యుస్కిల్స్ ఇంటర్న్‌షిప్‌లో లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో అవార్డు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.అప్పారావు తెలిపారు. గతేడాది డిసెంబరు 1 నుంచి గత సెప్టెంబరు 30 వరకు ఇంటర్న్‌షిప్ నిర్వహించగా, దేశవ్యాప్తంగా ఎడ్యుస్కిల్స్ ప్రకటించిన 100 కళాశాలల్లో స్థానం సాధించిందన్నారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సు ద్వారా ప్రశంసా పత్రాలను సాధించినట్లు పేర్కొన్నారు. సాధించిన అవార్డులను గురువారం కళాశాలలో ప్రదర్శించారు.

వరద బాధితులకు సాయం అభినందనీయం

గొల్లపూడి, న్యూస్‌టుడే: వరద బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే వసంతకృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఎస్‌బీఐ కార్డ్సు, రౌండ్‌టేబుల్ ఇండియా ఆధ్వర్యంలో జక్కంపూడికాలనీలో బాధితులకు నిత్యావసర సరకుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ వరద బాధితులకు ప్రభుత్వంతో పాటు కార్పొరేట్, ఎన్‌జీవోలు సహకారం అందిస్తున్నాయని తెలిపారు. గతంలో ఎన్నడూ కనీవినీ ఎరగని రీతిలో వరద ఉధృతిని చవి చూడటం జరిగిందన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా 50కి పైగా చెరువుల కట్టలు ఒక్కసారిగా తెగాయని తెలిపారు. మాట్లాడారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.


సరకులు అందిస్తున్న ఎమ్మెల్యే వసంతకృష్ణప్రసాద్

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

ఎ్రరమాడు(తిరువూరు), న్యూస్‌టుడే: పత్తిలో గులాబి రంగు పురుగు ఉనికిని గుర్తించేందుకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలని మండల వ్యవసాయధికారిణి పి.పద్మ రైతులకు సూచించారు. మండలంలోని ఎ్రరమాడులో గురువారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో సాగుదారులతో కలిసి క్షేత్రస్థాయిలో పత్తి పంటను పరిశీలించి సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. చెట్లకు గుడ్డి పువ్వులు, గొంగళి పురుగు గుర్తించి ఆర్థిక నష్టం అంచనా వేసి సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సర్పంచి బి.మాధవి, వీఏఏ శివపార్వతి పాల్గొన్నారు.

మహారాజశ్రీ నూజివీడు 15వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
G.W.O.P.No.49/2024
(మైనరు అయిన బొల్లెపోగు శ్రావ్య విషయం గురించి)
Between:
బొల్లెపోగు వాసు ... పిటీషనర్
మరియు
మంగళగిరి ప్రసాద్ ...రెస్పాండెంట్
పై నెంబరు O.P.లో పిటీషనరు తన మైనరు కుమార్తె అయిన బొల్లెపోగు శ్రావ్య పేరిట ది.22-05-2020న డాక్యుమెంటు నెం. 1573/2020రు రిజిష్టర్డ్ సెటిల్‌మెంటు దస్తావేజు ద్వారా సంక్రమింపజేయగా సదరు మైనరు చదువు మరియు పోషణ నిమిత్తం ఈ దిగువ ఉదహరించిన షెడ్యూలు ఆస్తిలో అనగా చ॥గ॥ 145.2లలో చ॥గ॥ 66.44లు ఆస్తిని సదరు O.P.లోని రెస్పాండెంటు అయిన మంగళగిరి ప్రసాద్‌కు రూ. 1,20,000/-లకు విక్రయించు నిమిత్తం పిటీషనరు తనను గార్డియన్‌గా ఉత్తర్వులు మరియు మైనరు పేరున గల ఆస్తిని రెస్పాండెంట్‌కు అమ్ముటకు పర్మిషన్ ఇప్పించవలసినదిగా కోరుచూ పై పిటీషనును దాఖలు చేయగా పై కోర్టువారు జనరల్ నోటీసు నిమిత్తం ది.15-10-2024నకు వాయిదా వేసియున్నారు. కావున సదరు పిటీషన్‌పై ఎవరికైనా అభ్యంతరములు వున్న యెడల సదరు వాయిదా రోజున ఉదయం గం॥ 10-30 ని॥లకు పై కోర్టు వారి యెదుట స్వయముగా గానీ లేదా న్యాయవాది ద్వారా గానీ హాజరై తెలుపుకొనగలరు. కావున ఇందుమూలంగా తెలియజేయటమైనది.
షెడ్యూలు ఆస్తి వివరం: కృష్ణాజిల్లా జిల్లా తిరువూరు సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా గంపలగూడెం మండలం పేదకొమిర పంచాయితీ, పేదకొమిర గ్రామములో (పడమటివైపు ల్యాండ్) చ॥గ॥ 145.2లలోని చ॥గ॥ 66.44లు లేదా య॥ 0.03 సెంట్లు, R.S.No.56, డోర్ నెం. 3-67, అసెస్‌మెంట్ నెం. 467కు **హద్దులు: తూర్పు:** చాట్ల హరీష్‌గారి ఇల్లు మరియు స్థలం అ॥ 23లు, **దక్షిణం:** గౌరసాని భాస్కర రెడ్డిగారి ఇల్లు మరియు స్థలం అ॥ 26లు, **పడమర:** R&B రోడ్, **ఉత్తరం:** మైనరు బొల్లెపోగు శ్రావ్య ఆస్తి అ॥ 26లు. ఈ హద్దుల మధ్య చ॥గ॥ 66.44లు.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేదీ: 15-10-2024
Y.U.S.V.V.సుబ్బారావు
పిటీషనరు తరపున న్యాయవాది
మచిలీపట్నం, ది. 2-10-24

కొలువుదీరిన దుర్గమ్మ.. కోర్కెలు తీర్చమ్మ

మైలవరం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని మొదటి రోజు గురువారం తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గమ్మ ప్రతిమలను ప్రతిష్ఠించి ప్రత్యేకపూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


మైలవరం: బాలా త్రిపురసుందరీ దేవిగా


ఇబ్రహీంపట్నం(గ్రామీణం) కాచవరంలో ..


కొండపల్లిలో..


జి.కొండూరు : వేణుగోపాలస్వామి ఆలయంలో ..


మైలవరం : లీలావతి పాఠశాలలో విద్యార్థుల వేషధారణ


రెడ్డిగూడెం రజక కాలనీలో..


తిరువూరు ముష్టికుంట్లలో


ఎ.కొండూరు చీమలపాడులో ..


గంపలగూడెం మెట్టగుట్టలో ..

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: నకిలీ మొక్కజొన్న విత్తనాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి ఎం.డేవిడ్ కోరారు. ఎ.కొండూరులో అక్కసాని రంగారావు, రాఘవులు, కాళహస్తి విజయలక్ష్మి, కొండూరు సుధారాణి అనే కౌలు రైతులు ఈ ఏడాది ఖరీఫ్‌లో ఏడు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా నకిలీ విత్తనం కారణంగా పంట దిగుబడి రాలేదన్నారు. గురువారం బాధిత రైతులతో కలిసి సీపీఐ నాయకులు క్షేత్రస్థాయిలో మొక్కజొన్న పైరును పరిశీలించారు. తిరువూరులోని ఓ దుకాణంలో విత్తనాలు కొనుగోలు చేశామని, ఎకరాకు రూ.20వేలు కౌలు చెల్లించి మరో రూ.50వేలు పెట్టుబడితో సాగు చేయగా అంతా నష్టపోయామని వాపోయారు. రైతులను మోసం చేసిన దుకాణదారుడిపై చర్యలు తీసుకోవాలని, కౌలు రైతులకు నష్ట పరిహారం ఇప్పించాలని సీపీఐ నాయకులు కోరారు. దీనిపై ఏవో ఎస్‌కే.టిప్పుసుల్తాన్‌ను సంప్రదించగా రైతుల ఫిర్యాదు మేరకు గురువారం మొక్కజొన్న పంటను పరిశీలించి జిల్లా వ్యవసాయాధికారికి నివేదిక పంపించామన్నారు. శాస్త్రవేత్తలు పరిశీలించి లోపాలను నిర్ధారిస్తారన్నారు.


మొక్కజొన్న పంటను రైతులతో కలిసి పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని బుడమేరు పరివాహక ప్రాంతమైన చిననంది గామ, వెల్లటూరు శివారు భీమవరప్పాడులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న విషయంపై గత నెల 30న 'తోటలో ఇసుక.. అమ్ముకో ఎంచక్కా' అనే శీర్షికన ఈనాడు పత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన జి.కొండూరు ఎస్సై సతీష్‌కుమార్ గురువారం తెల్లవారుజామున అక్రమంగా ఇసుక తరలించే 7 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. చిననందిగామకు చెందిన కొందరిపై కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించారు.

ఈనాడు కథనానికి స్పందన

దేవదత్ కార్యాలయంలో కార్యకర్తల హడావుడి


దేవదత్ కార్యాలయం వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వ్యవహారం గురువారం కొత్త మలుపు తిరిగింది. ఆయనకు ప్రత్యామ్నాయంగా తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శావల దేవదత్‌ను నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమిస్తున్నారంటూ ఆయన వర్గీయులు హంగామా చేశారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల నుంచి తెదేపా సీనియర్ నాయకులు, కార్యకర్తలు గురువారం ఉదయం నుంచే స్థానికంగా ఉన్న దేవదత్ కార్యాలయానికి చేరుకుని ఆయనకు శుభాకాంక్షలు చెప్పారు. అయితే తెదేపా అధిష్ఠానం నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన లేకపోయినా దేవదత్ కార్యాలయంలో పెద్ద సంఖ్యలో చేరుకుని హడావుడి చేయడంపై భిన్న చర్చలు మొదలయ్యాయి. సార్వత్రిక ఎన్నికల ముందు వరకు దేవదత్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహించారు. ఇటీవల తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు వ్యవహార శైలి వివాదస్పదమైంది. పాత్రికేయులను, రైతులను కించపరిచే విధంగా మాట్లాడటం, వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపణలు రావడంతో నియోజకవర్గంపై అధిష్ఠానం దృష్టి సారించింది. ఇప్పటికే అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు గత మూడు నెలలుగా తమకు ఎదురవుతున్న ఇబ్బందులను తెదేపా జాతీయ, రాష్ట్ర నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. తెలుగు మహిళలు ఉద్యమించారు. ప్రతిగా ఎమ్మెల్యే కూడా తన వర్గీయులతో సమావేశం నిర్వహించి తనపై చేసిన ఆరోపణలు నిరూపించాలని సవాల్ విసిరారు. తప్పు చేసిన వారిని శిక్షించాలని బహిరంగంగానే కోరారు. ఈ నేపథ్యంలో తెదేపా అధిష్ఠానం నుంచి ఎటువంటి అధికారిక ఆదేశాలు లేకపోయినా దేవదత్ వర్గీయులు తమకు విశ్వసనీయ సమాచారం ఉందంటూ చెప్పుకొంటున్నారు.

నాగపూర్‌లో లారీ డ్రైవర్ మృతి

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: తిరువూరుకు చెందిన ఓ లారీ డ్రైవర్ నాగపూర్‌లో మరణించాడు. ఆయన మృతదేహాన్ని క్లీనర్ గురువారం హనుమాన్‌జంక్షన్ తీసుకొచ్చాడు. ఎస్సై జనార్ధన్ కథనం ప్రకారం.. బంకా ఏసురత్నం(48) హనుమాన్‌జంక్షన్‌లోని వీరాంజనేయ లారీ ట్రాన్స్‌పోర్టుకు చెందిన లారీపై దిల్లీ వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో నాగపూర్‌లో ఆగాడు. అక్కడ అస్వస్థతకు గురై ఈ నెల 2న ప్రాణాలు కోల్పోయాడు. దీంతో లారీ క్లీనర్ అంబులెన్సులో మృతదేహాన్ని హనుమాన్‌జంక్షన్ తీసుకువచ్చాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రిలో శవపరీక్ష చేయించారు.

నోటీసు

జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టు, మైలవరం
O S.No: 32/2023
Between: M/s Canara Bank, Mylavaram
Rep. by its Manager ---Plaintiff
And
Bobburi Ramesh Chandra, S/o Chinna Nageswara Rao, Hindu, Business, Aged about 45 Yrs, Prop: Ramesh Shoe Mart, PVNR Complex, Bhadrachalam Road, Mylavaram V&M, NTR Dist. ---Defendant
ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా పైన తెలిపిన దావా నెం. 32/2023లో మీరు ప్రతివాదియైయున్నారు. శ్రీ కోర్టువారు మీకు సమన్లు జారీ చేసినప్పటికీ మీరు కోర్టుకు హాజరు కాకపోవడం వలన ది.14-11-2024న మీ హాజరు కొరకు వాయిదా వేసియున్నారు. కనుక మీరు వాయిదా రోజున మీరుగాని, మీ తరుపున లాయరు గారి ద్వారాగాని కోర్టుకు హాజరు నిమిత్తం ఆర్డరు వేసియున్నారు. మీరు హాజరు కాని పక్షంలో శ్రీ కోర్టువారు ప్రతికూల ఉత్తర్వులు జారీ చేయుదురు. కనుక తెలియజేయడమైనది.
వాయిదా : 14-11-2024, ఆర్డరు తేదీ: 12-10-2023
ఇట్లు : **K.V.R.N. ముత్యప్రసాద్, పావులూరి వెంకట శేషగిరిరావు**
న్యాయవాదులు, మైలవరం. సెల్ నెం: 98482 11112
మైలవరం, తేదీ: 03-10.2024

నోటీసు

మహారాజశ్రీ మైలవరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
O.S.No. 68/2023
Between:
M/s S.B.I., Mylavaram, rep by its Manager, Mylavaram ...Plaintiff
and
Pemmaraju Lakshmi Satya Mohan Rao, S/o Rajendra Prasada Rao, Hindu, Aged about 45 yrs, D.No. 1-172, Near UPSC School, West Madhavaram, A.Konduru Mandal (Mylavaram JCJC) ... Defendant
పైన తెలిపిన దావాలో మీరు ప్రతివాది అయిన కోర్టుకు హాజరు అగుటకు వాయిదా నిమిత్తం ది. 14-11-2023 తేదీన వేసియున్నారు. సదరు వాయిదా రోజు ఉదయం 10.00 గం.లకు మీరు గాని మీ లాయరుగారి ద్వారాగాని పై కోర్టువారి ముందు హాజరై మీ సమాధానం తెలుపుటకు లేనిపక్షంలో మీ పరోక్షముగా విచారించి తీర్మానించబడును. ఇందుమూలముగా తెలియజేయటమైనది.
శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం, **వాయిదా : 14-11-24**
ఇట్లు **K.V.R.N.ముత్యప్రసాద్, పావులూరు వెంకట శేషగిరిరావు**
న్యాయవాదులు, మైలవరం. సెల్: 98482 11112.
మైలవరం, తేదీ: 03-10.2024

నందిగామ
• నందిగామ • జగ్గయ్యపేట

అందరికీ అందుబాటులో ఉండి సేవలందిస్తా


ఆర్డీవో కె. బాలకృష్ణ

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామ రెవెన్యూ డివిజన్‌లో అందరికీ అందుబాటులో ఉంటూ విధులు నిర్వహిస్తానని నూతన ఆర్డీవో కె.బాలకృష్ణ తెలిపారు. నందిగామ ఆర్డీవోగా గురువారం ఆయన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వెళ్తున్న ఆర్డీవో రవీంద్రరావు ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా నూతన ఆర్డీవో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆర్డీవోను తహసీల్దారు సూతక్కీ సురేష్, ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా దర్బార్ నేడు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: చిల్లకల్లు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 9న జరగాల్సిన ఈ కార్యక్రమం అనివార్య కారణాల వల్ల నేటికి వాయిదా పడింది. గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ముంపు బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామలో మునేరు వరద ముంపునకు గురైన ఇళ్ల బాధితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి కటారపు గోపాల్ కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు గురువారం బాధితులతో కలిసి స్థానిక తహసీల్దారు సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గోపాల్ మాట్లాడుతూ స్థానిక మార్కెట్టు యార్డు వెనుక భాగంలో వరదలకు 50 ఇళ్లు ముంపునకు గురయ్యాయని తెలిపారు. నేటికీ బాధితులకు నష్టపరిహారం మంజూరు చేయలేదన్నారు.


తహసీల్దార్ సురేష్‌కి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు, బాధితులు

బియ్యం, దుప్పట్ల పంపిణీ

నందిగామ, న్యూస్‌టుడే: స్థానిక ముక్త్యాలనగర్‌లో దూలాస్ ట్రస్ట్, చర్చ్ ఆఫ్ క్రైస్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వాహకులు వితంతువులు, పేదలకు బియ్యం, దుప్పట్లు పంపిణీ చేశారు. కాలనీలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 110 మందికి అందజేశారు. ట్రస్ట్ ప్రతినిధులు దేవసహాయం, జ్ఞానవరకుమార్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో దూలాస్ ట్రస్ట్ ప్రతినిధులు

ఉత్సవ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని అంబారుపేట సత్యమ్మతల్లి దేవాలయంలో దసరా ఉత్సవ కమిటీ సభ్యులతో గురువారం ఈవో జి.హరిగోపీనాథ్ ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీ సభ్యులుగా ఎం.మాధవరావు, సీహెచ్ శ్రీనివాసరావు, డి.వెంకటేశ్వర్లు, కె.వీరమ్మ, టి.పార్వతి, ఎస్.సత్యనారాయణ, బి.కాంతారావు, కేవీఎన్ రాజారావు, బి.అమరయ్య ప్రమాణం చేశారు. ఈనెల 15వరకు ఈ కమిటీ పనిచేస్తుందని దేవాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు.

మిరప సాగుపైనే ఆశలు

ముమ్మరంగా వ్యవసాయ పనులు

సమృద్ధిగా వర్షాలు కురవడంతో..

న్యూస్‌టుడే, పెనుగంచిప్రోలు, వత్సవాయి

ఈ ఖరీఫ్‌లో మిరప సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. గడిచిన నాలుగైదేళ్లుగా వరుస నష్టాలు ఎదురైనా కుంగిపోకుండా మిరప సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. గత ఏడాది చవిచూసిన నష్టాలతో ఇక చాలులే అనుకున్న రైతులే కొత్త ఆశతో ఈ ఖరీఫ్‌లో విస్తారంగా సాగు చేస్తున్నారు. ఈ ఏడాది సాగర్ జలాలు అందిరావడంతో రైతులకు భరోసా దొరికింది. భారీ వర్షాలు, మునేరు వచ్చిన వరదల వల్ల సాగులో ఉన్న పత్తి, ఇతర మెట్ట పంటలు దెబ్బతినడంతో రైతులకు మిరప పంట ఆశాదీపంగా కనిపిస్తోంది.


వత్సవాయి వద్ద మొక్కలు నాటుతున్న కూలీలు

జిల్లాలోని అత్యధికంగా జగ్గయ్యపేట నియోజకవర్గంలో 25 వేల ఎకరాల్లో మిర్చి సాగవుతుండగా అందులో వత్సవాయిలో సగటున 15 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, ధరల పతనం, తీవ్ర వర్షాభావం, సాగునీటి ఎద్దడి వంటి సమస్యలతో వరుస నష్టాలు చవిచూసిన కర్షకులు ఈ ఏడాది మిర్చి సాగుకు సుముఖంగా లేరు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమృద్ధిగా వర్షాలు కురిసి సాగర్ డ్యాం నిండింది. వెంటనే స్పందించిన ఏపీ జలవనరుల అధికారులు జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల పరిధిలో సుమారు లక్ష ఎకరాలకు సాగునీరు అందించే డీవీఆర్ బ్రాంచికి సాగునీరు సరఫరా చేసేందుకు షెడ్యూల్ ప్రకటించి నీరు విడుదల చేస్తున్నారు.


సాగర్ కాల్వలో పారుతున్న నీరు

భారీ వర్షాల వల్ల పత్తి, మొక్కజొన్న, ఇతర పంటలు దెబ్బతినడంతో ఇప్పుడు రైతులు మిర్చి సాగుపై దృష్టి పెట్టారు.

డీవీఆర్ బ్రాంచి పరిధిలోనే అధికం

జగ్గయ్యపేట నియోజకవర్గంలో డీవీఆర్ బ్రాంచి కాలువతో జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు మండలాలకు సాగునీరు అందుతోంది. వత్సవాయి మండలానికి డీవీఆర్ బ్రాంచితో పాటు, బోనకల్ బ్రాంచి కాలువ నుంచి సమృద్ధిగా నీరు పారుతుండడంతో అన్నదాతలు మిర్చి సాగు చేస్తున్నారు. ఇప్పటికే నర్సరీల్లో సాగు చేసిన మిర్చి నారు అందుబాటులో ఉండడంతో రైతులు మొక్కలు నాటుతున్నారు. ఎన్ఎస్పీ నుంచి సాగునీరు అందకుంటే మిర్చిసాగు సగానికి పడిపోయేదని, సకాలంలో నీరందడంతో పూర్తి స్థాయిలో సాగు చేపట్టనున్నట్లు రైతులు చెబుతున్నారు.

విద్యుత్తు సరఫరా నిలిచి అవస్థలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: ఏటిపట్టు గ్రామాల్లో బుధవారం రాత్రి వీచిన గాలులకు విద్యుత్తు తీగలు తెగి రాత్రి 8 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిచింది. దీంతో కొండూరు, మాగల్లు, రామిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో చిన్నారులు, వృద్ధులు ఉక్కపోత, దోమలతో ఇబ్బంది పడ్డారు.

ఈ-కేవైసీ గడువు పెంపు

జగ్గయ్యపేట గ్రామీణం: జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలంలోని రైతులకు పంట నమోదు చేసుకోవడానికి ఈ-కేవైసీ ఈనెల 7వ తేదీ వరకు పొడగించినట్లు సహాయ వ్యవసాయ సహాయకులు చుక్కా భవాని గురువారం తెలిపారు. ఇప్పటి వరకు ఈ-కేవైసీ చేసుకోని రైతులు వెంటనే నమోదు చేసుకోవాలని, తప్పులు ఉన్నవారు సరిచేసుకోవాలన్నారు. వివరాలకు సంబంధిత రైతు సేవా కేంద్రం గ్రామ వ్యవసాయ సహాయకులు, మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలన్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

జగ్గయ్యపేట గ్రామీణం: జగ్గయ్యపేట ఎంపీడీవోగా జి.నితిన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సాధారణ బదిలీలో భాగంగా పల్నాడు జిల్లా మార్టూరు నుంచి జగ్గయ్యపేటకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన ఎం.రమేష్‌బాబు గుంటూరు జిల్లా వట్టిచెరుకూరుకు బదిలీపై వెళ్లారు.

కరదీపికలతో ప్రచారం

జగ్గయ్యపేట: ఈనెల 9న విజయవాడలో చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని బీఎస్పీ ఆధ్వర్యంలో నాయకులు కరపత్రాలతో ప్రచారం చేశారు. కొదమల ప్రభుదాసు ఆధ్వర్యంలో నాయకులు మాట్లాడుతూ బీఎస్పీ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో బీసీల జనగణనను కోరుతూ చేపట్టే ఈ కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు.

రజక సంఘం ఎన్నికలు

జగ్గయ్యపేట: సీతారామాంజనేయ వాషర్‌మెన్ సంఘం నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా టి.శ్రీనివాసరావు, జి.బుచ్చిబాబు, ఉపాధ్యక్షుడిగా టి.రవి, డైరెక్టర్లుగా వెంకటేశ్వర్లు, మణికంఠ, వీరబాబు, సైదులు, పుల్లయ్య, నాగార్జునలు ఎన్నికయ్యారు. నాగలింగేశ్వరాలయంలో జరిగిన ఎన్నికల్లో పూర్వ అధ్యక్షుడు వీరయ్య అధ్యక్షత వహించారు.

ముగిసిన సంపూర్ణత అభియాన్

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలులో చేపట్టిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమం విజయవంతమైందని ఎంపీడీవో సాయిహర్ష తెలిపారు. ముగింపు కార్యక్రమాన్ని గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమం మండల సమన్వయకర్త మోహన్‌సందీప్ తదితరులు పాల్గొన్నారు.
* బదిలీ అయిన ఎంపీడీవో సాయిహర్ష, ఈవోపీఆర్డీ ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ సాయి, పంచాయతీ కార్యదర్శులు వీరభద్రం, కొండను ప్రజాప్రతినిధులు సత్కరించారు.

ఆదమరిస్తే గుంతల్లోకే..

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ-మధిర రహదారిలో కొండూరు వద్ద వరదకు ఆర్‌అండ్‌బీ రహదారి అంచు కోతకు గురైంది. తోడేళ్లవాగు వరదకు ఇక్కడ రహదారి అంచులు కోతకు గురికావడంతో ద్విచక్ర వాహనాలు గుంతలోకి వెళ్లకుండా రహదారి అంచులో వరుసగా రాళ్లు పెట్టారు. రాత్రుళ్లు ఇవి కనిపించని పరిస్థితి. ఆటోలు, ద్విచక్ర వాహనచోదకులు ఏ మాత్రం ఏమరు పాటుగా ఉన్నా రహదారి పక్కన గుంతలో పడిపోయే ప్రమాదం ఉంది. మరో వైపు మాగల్లు గ్రామంలో ఆర్ అండ్‌బీ రహదారిపై గుంతలతో ద్విచక్ర వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. వీటికి వెంటనే మరమ్మతులు చేయించాలని వాహనచోదకులు కోరుతున్నారు.


కొండూరు వద్ద వరదకు కోతకు గురై..


మాగల్లు వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా..


వాహనదారులకు అడ్డుగా శిలాఫలకం దిమ్మె

పొంచి ఉన్న ప్రమాదం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: ఇటీవల వచ్చిన వరదకు పెనుగంచిప్రోలులోని మునేరు వంతెనపై ఉన్న శిలాఫలకం దిమ్మె పడిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వంతెనపై విద్యుత్తు దీపాలు ధ్వంసం కావడంతో రాత్రి వేళల్లో వాహనదారులు దిమ్మెను ఢీకొని గాయాలపాలవుతున్నారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులు దిమ్మెను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో శునకాలు

అదరం.. బెదరం

కంచికచర్ల, న్యూస్‌టుడే: కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యం కోసం వెళ్లాలంటే రోగులు భయంతో హడలిపోతున్నారు. స్థానికంగా ఉండే వీధి శునకాలు ఆసుపత్రి ఆవరణలో గుంపులుగా సంచరిస్తూ.. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వచ్చే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్తే.. కుక్కలు ఎక్కడ కరుస్తాయోనని రోగులు భయ పడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి ఆసుపత్రి ఆవరణలో శునకాలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శ్రీరామలింగేశ్వరుని తాకిన సూర్యకిరణాలు



రాఘవాపురం (నందిగామ గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని రాఘవాపురం శివాలయంలో గురువారం ఉదయం శ్రీరామలింగేశ్వరస్వామి (శివలింగం)ని సూర్యకిరణాలు తాకాయి. ఉదయం 6గంటల సమయంలో 30 నిముషాలపాటు సూర్యకిరణాలు స్వామివారిని తాకడంతో భక్తులు దర్శించుకుని పరవశించారు. ఏటా ఆశ్వీజయుజ మాసంలో ఉదయం సూర్యకిరణాలు గర్భాలయంలోని శివలింగాన్ని తాకుతాయని అర్చకుడు యనమదల రాజేష్‌శర్మ తెలిపారు.

పేట డిపోకు కొత్త బస్సుల కళ


బస్సులు ప్రారంభిస్తున్న తాతయ్య

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట డిపో నుంచి విజయవాడకు తిరిగే మూడు ఎక్స్‌ప్రెస్ బస్సులను గురువారం ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య ప్రారంభించారు. జగ్గయ్యపేట నుంచి వివిధ దూర ప్రాంతాలకు కూడా బస్సు సర్వీసులు పెంచేలా కృషి జరుగుతుందన్నారు. డిపో మేనేజర్ రఘురాం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తాగునీటి పనులు వేగవంతం చేయండి

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: గత నెలలో వచ్చిన భారీవర్షాలు, మునేరు వరదలకు నిలిచిన తాగునీటి సరఫరాను పునరుద్ధరించేందుకు చేపట్టిన పనులు వేగవంతం చేయాలని మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు గుంటుపల్లి వాసు కోరారు. గురువారం ఆయన అధ్యక్షతన నిర్వహించిన మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో సాయిహర్ష, మండల అధికారులు పాల్గొన్నారు. తాగునీటి పథకాల మరమ్మతు పనులు సత్వరం పూర్తిచేయాలని ఆయన అధికారులకు సూచించారు. మునేరు వరదకు పొలాల్లో ఇసుక మేటలు వేసిన రైతులను ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏవో సిద్ధారెడ్డి, ఎంఈవో రవీంద్ర, వ్యవసాయాధికారి రామసుబ్బారెడ్డి, వైద్యురాలు ఇందిర, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల వచ్చిన వరదల వల్ల తీవ్ర నష్టం వాటిల్లిన పాలేరు పరివాహక ప్రాంత గ్రామాలైన తక్కెళ్ళపాడు, రెడ్డినాయక్‌తండా బూదవాడ, బలుసుపాడు రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఎన్టీఆర్ జిల్లా సీపీఎం కార్యదర్శి డి.వి.కృష్ణ డిమాండ్ చేశారు. మండలంలో గురువారం సీపీఎం బృందం రైతులతో కలిసి కోతకు గురైన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలేరు వరదతో రైతుల పొలాలు రాళ్లు, ఇసుకతో నిండిపోయాయన్నారు. సీపీఎం నాయకులు సీహెచ్ శ్రీనివాస్, రావెళ్ల శేషు, దాసరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పల్లగిరిపై త్రిశక్తి దేవాలయంలో..


బాలాత్రిపురసుందరిగా మరిడీమహాలక్ష్మి మూలమూర్తి


నందిగామ శివాలయంలో..


అంబారుపేటలో ..


పెద్దవరం శివాలయంలో ...


బాలాత్రిపురసుందరిగా దర్శనమిస్తున్న వాసవీమాత

బాలాత్రిపుర సుందరీ పాహిమాం

న్యూస్‌టుడే బృందం, న్యూస్‌టుడే: నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. పలు దేవాలయాల్లోను, స్థానిక కమిటీల ఆధ్వర్యంలోను ఈ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. గ్రామాల్లో పూల బతుకమ్మలు ఏర్పాటు చేసి మహిళలంతా ఓ చోటకు చేరి నృత్యాలు, ఆటపాటలతో అమ్మవారిని ఊరేగించారు. భజనలు, కుంకుమ పూజలు నిర్వహించారు.


పెనుగంచిప్రోలు డౌన్‌సెంటర్‌లో..


ఎమ్మెల్యే సౌమ్యను సన్మానిస్తున్న దుర్గానగర్ కనకదుర్గమ్మ దేవాలయ కమిటీ సభ్యులు


తిరుపతమ్మ ఆలయంలో..


కంచికచర్ల పాత శివాలయంలో..


కంచికచర్లలో ..


పెనుగంచిప్రోలు అమ్మవారి విగ్రహం ఊరేగింపు


పెనుగంచిప్రోలు తూర్పుబజార్‌లో..

బతుకమ్మ..బతుకమ్మ ఉయ్యాలో..


నెహ్రూనగర్‌లో బతుకమ్మలాడుతున్న మహిళలు


పెనుగంచిప్రోలు డౌన్‌సెంటర్‌లో

నందిగామ గ్రామీణం: నందిగామ నెహ్రూనగర్ వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద దసరా వేడుకలను పురస్కరించుకుని గురువారం రాత్రి మహిళలు బతుకమ్మ ఉత్సవం ప్రారంభించారు. పూలతో తయారు చేసిన బతుకమ్మలను పేర్చి జానపద పాటలు ఆలపించారు. పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు డౌన్‌సెంటర్‌లో గురువారం మహిళలు బతుకమ్మ వేడుకలు చేశారు. జగ్గయ్యపేట: పట్టణంలోని వరదరాజస్వామి ఆలయంలో గురువారం బతుకమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. రెండో రోజు కార్యక్రమాల్లో భాగంగా బతుకమ్మలాటలో పలు సంప్రదాయ క్రతువులు నిర్వహించారు.

అతిక్రమిస్తే చర్యలు తప్పవు

జగ్గయ్యపేట: పట్టణంలోని 13, 14 సచివాలయాలను గురువారం మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఆకస్మిక తనిఖీ చేశారు. ఎవరైనా సిబ్బంది విధి నిర్వహణలో గానీ, ప్రజలతో ప్రవర్తన విషయంలోగానీ నిబంధనలు అతిక్రమిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని అన్నారు.

ఆహ్లాదకరంగా మారుద్దాం

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట పట్టణానికి ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చూద్దామని ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య అన్నారు. మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, అధికారులు, పర్యాటక రంగం ప్రతినిధులతో కలిసి తన స్వగృహంలో సమీక్ష నిర్వహించారు.

న్యాయవాదుల నిరసన

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ సభ్యులు గురువారం నిరసన ప్రదర్శన చేశారు. అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి తమ నిరసన తెలిపారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తమ నిర్ణయాలు మార్చుకోవాలని డిమాండ్ చేశారు.

కాకతీయ సేవా సమితి నాయకుడి మృతి

జగ్గయ్యపేట: కాకతీయ సేవా సమితి మాజీ అధ్యక్షుడు, జిల్లా నాయకులు మక్కపాటి జానకీరామయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి తెదేపా నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు నెట్టెం శివరాం, సేవాసమితి ప్రతినిధులు రంగయ్య, సుబ్బారావు తదితరులు నివాళులర్పించారు.

లారీ ఢీకొని నాలుగు గేదెల మృతి

జుజ్జూరు(వీరులపాడు), న్యూస్‌టుడే: కంటైనర్ లారీ ఢీకొట్టడంతో నాలుగు గేదెలు మృతి చెందిన ఘటన జుజ్జూరు వద్ద గురువారం చోటుచేసుకుంది. ఎస్సై జి.అనిల్, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... జుజ్జూరు శివారులోని ఒక ప్రైవేటు కర్మాగారానికి తమిళనాడు నుంచి ముడి సరకు దిగుమతి చేయడానికి వచ్చిన లారీ తిరుగు ప్రయాణంలో అదుపుతప్పి రహదారిపై వస్తున్న గేదెలను ఢీకొంది. నాలుగు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. కాపరి జానకి వెంకట నర్సయ్యకు తీవ్ర గాయాలవ్వడంతో చికిత్స నిమిత్తం కంచికచర్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అతనితో పాటు ఉన్న యాకాలపు నాగరాజుకు స్వల్ప గాయాలయ్యాయి. ☛ అదే సమయంలో జుజ్జూరు నుంచి రంగాపురం వైపు వెళ్తున్న ఆటోను లారీ ఢీకొట్టడంతో ఆటో రహదారి పక్కనే ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొంది. ఆటో పూర్తిగా ధ్వంసం కాగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. లారీకి బ్రేకులు సరిగా పనిచేయకపోవడంతో లారీ అదుపు తప్పిందని లారీ డ్రైవర్ అబ్దుల్ షాజహాన్ తెలిపినట్లు ఎస్సై వివరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

వర్ష బీభత్సం.. స్తంభించిన జనజీవనం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: బుధవారం రాత్రి భారీ వర్షంతోపాటు ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు జనజీవనాన్ని తీవ్రంగా కుదిపేశాయి. గురువారం సాయంత్రం వరకు విద్యుత్తు పునరుద్ధరణ పనులు జరిపినా ఇంకా కొన్ని గ్రామాలకు పూర్తిస్థాయిలో సరఫరా కాలేదు. జగ్గయ్యపేట పట్టణం సహా ప్రాంతమంతా రోడ్లపై భారీ చెట్లు పడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ఆ చెట్లను తొలగిస్తూనే ఉన్నారు. పట్టణంలోని చెరువు బజార్‌లో కట్టపై ఉన్న ఇంటి వద్ద కారుపై చెట్టు పడి కారు ధ్వంసమైంది. బలుసుపాడురోడ్డులో నాలుగు చెట్లు, బలుసుపాడు నుంచి జాతీయ రహదారికి వెళ్లే దారిపై మరో చెట్టు పడిపోయింది. తిరుమలగిరి దారిలో, తొర్రగుంటపాలెం సమీపంలో చెట్లు నేలవాలాయి. జగ్గయ్యపేట సహా చిల్లకల్లు, ముక్త్యాల, అగ్రహారం, బలుసుపాడు, అనుమంచిపల్లి గ్రామాల్లో చెట్లు పడి విద్యుత్తు స్తంభాలు, కండెక్టర్లు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. అన్ని గ్రామాలకు విద్యుత్తు పునరుద్ధరించినట్లు ఏడీఈ శ్రీనివాసరావు తెలిపారు.

విద్యుత్తు నిలిపేసిన కోతి చేష్టలు: జాతీయ రహదారి పక్కనే ఉన్న 11 కేవీ టవర్ పైకి ఎక్కిన కోతి కండక్టర్‌ని పట్టుకోవడంతో విద్యుదాఘాతమై మొత్తం విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. మరమ్మతుల అనంతరం తిరిగి సరఫరా ఇచ్చే సమయంలో ఇది జరగడంతో దాన్ని అక్కడి నుంచి కిందికి తెప్పించేందుకు నానా తంటాలు పడ్డారు. మళ్లీ సరఫరా ఇచ్చినా కోతి చేష్టలతో ఏం చేస్తుందోనని అది బయటకు వచ్చే వరకూ అధికారులు, సిబ్బంది నానా కసరత్తు చేయడంతో సుమారు గంటన్నర పాటు విద్యుత్తు సరఫరాకు ఆలస్యం జరిగింది.


బలుసుపాడు రోడ్డులో పడిపోయిన భారీ వృక్షం


జగ్గయయ్యపేట చెరువుకట్ట వద్ద కారుపై పడిన చెట్టు

స్పందనకు వందనం

❖ పైపులైన్‌కు మరమ్మతులు: 10వ డివిజన్ ఆర్టీసీ కాలనీ చివరి రోడ్డులో తాగునీటి పైపు లీకేజీ అవుతోందని స్థానిక నివాసి సీహెచ్ వెంకటేశ్వరరావు మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ జశ్వంత్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన స్పందించి మరమ్మతులు చేయించారు. ❖ విద్యుత్తు దీపం ఏర్పాటు: పటమట సరోజినీ ఆస్పత్రి రోడ్డులో 14-60/24 స్తంభానికి దీపం వెలగడంలేదని శామ్యూల్ ఏఈ నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి సిబ్బందిని పంపించి కొత్త దీపం ఏర్పాటు చేయించారు.

? మూడో డివిజన్ కరెన్సీనగర్ గుత్తికొండ ధనుంజయరావు వీధి, డీవీరావు వీధుల్లో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పొంగుతున్నాయి. – కోటేశ్వరరావు
✔ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం – నాగేశ్వరరావు, ఏఈ – న్యూస్‌టుడే, కరెన్సీనగర్

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

పటమట: తూర్పు నియోజకవర్గ పరిధిలోని పట్టభద్రుల ఓటు నమోదుకు యంత్రాంగం చర్యలు చేపట్టింది. 01-10-2021 నాటికి డిగ్రీ పూర్తయిన వారు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలోని తూర్పు నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి కార్యాలయం, తూర్పు తహసీల్దార్ కార్యాలయం, వీఎంసీ కార్యాలయంలో ఫారం-18 దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని ఈ నెల 6 లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

విజయవాడ తూర్పు

నేటి నుంచి ఉచిత చెస్ శిక్షణ శిబిరం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: గ్లోబల్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి వారం రోజులు పటమటలోని సీహెచ్ఆర్‌కే వీఎంసీ ఇండోర్ స్టేడియంలో ఉచిత దసరా చెస్ శిక్షణ శిబిరం నిర్వహిస్తామని అకాడమీ కార్యదర్శి, అంతర్జాతీయ చెస్ కోచ్ ఎస్‌కే ఖాశీం తెలిపారు. ఇటీవల జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో స్త్రీ, పురుషుల భారత జట్లు విజయదుందుభి మోగించిన సందర్భంగా 7 నుంచి 15 సంవత్సరాల్లోపు విద్యార్థులకు ఈ ఉచిత శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఫోన్ 98495 14138 నంబరుపై సంప్రదించాలన్నారు.

మద్యం దుకాణం వద్దు


ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

పటమట, న్యూస్‌టుడే: తూర్పు నియోజకవర్గం 9వ డివిజన్‌లోని చేపల మార్కెట్ వద్ద ఉన్న ప్రైవేట్ మద్యం దుకాణాన్ని తరలించాలని, నూతన వైన్ షాపును అక్కడ ఏర్పాటు చేయకుండా చూడాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి గురువారం అశోక్‌నగర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ముందుబాబులు నిత్యం రోడ్డు మీద తాగి గొడవలు పడుతున్నారని, అటువైపుగా రాకపోకలు సాగించే మహిళలు, విద్యార్థినులతో అసభ్యంగా ప్రవరిస్తున్నారని తెలిపారు. దీని వల్ల స్థానికులు అటువైపు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బెంజ్‌సర్కిల్ పైవంతెన కింద నుంచి పటమటలంక ఫకీరుగుడెంను అనుసంధానం చేస్తూ రోడ్డును వెడల్పు చేయాలని, రామలింగేశ్వరనగర్‌కు వెళ్లే నటరాజన్ గుల్జార్ వంతెన పక్కన మరో వంతెన నిర్మించాలని కోరారు. నాయకులు దోనేపూడి సూరిబాబు, లంక నాగమణి, పరుచూరి అజయ్. బంకపల్లి త్రిమూర్తులు, లంక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు సమస్యకు పరిష్కారమెప్పుడో?

వరద నుంచి గుణపాఠం నేర్చుకుంటే మేలు


కరెన్సీనగర్, న్యూస్‌టుడే


నడుము లోతు నీళ్లలో భారతీనగర్ ప్రధాన వీధి (పాత చిత్రం)

విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని నాలుగో డివిజన్ పలు కాలనీలు వరద ముంపులో కొట్టుమిట్టాడుతున్నాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. డివిజన్ నుంచి గుంటతిప్ప, పంటకాలువ, పుల్లేటి కట్ట మూడు ప్రధాన డ్రెయిన్లు ప్రవహిస్తున్నా వరదనీటి మళ్లించడానికి అనువుగా లేవని ఇటీవల తేటతెల్లమైంది. దీనికితోడు అసంపూర్తి డ్రెయిన్లు కూడా కారణంగా ఉంది.

ఇదీ పరిస్థితి: గత నెల మొదటి వారం విజయవాడలో ఒక్కరోజున 37 సెం.మీ. వర్షపాతం నమోదై నగరం మునిగిపోయిన సంగతి తెలిసిందే. ఇంట్లో కాలు బయట పెట్టలేనట్లుగా నీరు రోడ్లను ముంచెత్తింది. కాలనీ ప్రధాన రహదారులన్నీ నీటమునగడంతో ప్రధాన డ్రెయిన్‌కు వెళ్లే కాలువలు పొంగిపొర్లాయి. అసంపూర్తి డ్రెయిన్ల నిర్మాణం, పూడికలు తీయకపోవడం, డ్రెయిన్ల నిర్మాణాల్లో ఎత్తుపల్లాలు మురుగునీరు పారుదలకు ఆటంకంగా మారాయి. దీంతో కరెన్సీనగర్ మొదలుకొని బెంజిసర్కిల్ వరకు జాతీయ రహదారి, సర్వీస్ రోడ్లు నీటమునిగాయి. వరద నీటిని ఏవిధంగా మళ్లించాలో అంతుపట్టని పరిస్థితి నెలకొంది.

ఎన్నడూ చూడలేదు




గత 40 ఏళ్లుగా కాలనీలో ఉంటున్నాం. ఎన్నడూ ఇలాంటి వరద చూడలేదు. ప్రధాన రహదారిలో నడుము లోతు నీరు చాలా రోజులు ఉంది. రహదారి నిర్మించే సమయంలో డ్రెయిన్ల వాటాన్ని జాతీయ రహదారి వైపుగా తిప్పడంతో సమస్య వచ్చింది. డ్రెయిన్ల ప్రక్షాళన జరగాలి.
– మైనేని సాయి బాబు (భారతీనగర్, అధ్యక్షుడు)

ప్రతి ఇంటికి రూ.50వేలు పైగా నష్టం




ఏపీఐఐసీ కాలనీలో దాదాపు 700 వరకు ఇళ్లున్నాయి. వరద ముంపు వల్ల ప్రతి ఇంటికీ రూ.50వేల పైబడే నష్టం వచ్చింది. రోడ్లు బాగానే ఉన్నా డ్రెయినేజీ వ్యవస్థ, భూగర్భ డ్రెయినేజీ సంపుల సామర్థ్యం సరిపోవడం లేదు. యంత్రాల సామర్థ్యం పెంచాల్సి ఉంది.
– పాతూరి సాంబశివరావు (ఏపీఐఐసీ కాలనీ, అధ్యక్షులు)

కాలువల ప్రక్షాళన అవసరం



కాలనీలో 30 ఏళ్ల నాటి డ్రెయిన్లు కావడంతో ప్రస్తుతం చాలడం లేదు. చాలా వరకు ధ్వంసమయ్యాయి. కొత్తగా రోడ్లు ఏర్పాటు చేసినప్పుడే డ్రెయిన్లపైనా దృష్టి పెడితే వరద ముంపు అంతగా ఉండేది కాదు. పంట కాలువ డ్రెయిన్‌కు వెళ్లే కాలువలను ప్రక్షాళన చేయాలి. – యలమంచిలి రాజా (శ్రీనివాసనగర్ బ్యాంకు కాలనీ, కార్యదర్శి)

పది రోజులు వాకింగ్‌కు దూరం



70 ఏళ్ల వయసులోనూ రోజూ వాకింగ్ చేస్తుంటాం. ఇటీవల వరదలకు పది రోజులు వాకింగ్ లేకుండా గడిపాం. కాలనీలో రోడ్లలో మోకాల్లోతు వరద నీరు చేరింది. పుల్లేటి కట్టకు వెళ్లే డ్రెయిన్లు పూడుకుపోయాయి. వర్షాకాలం వచ్చే ముందు పూడిక పనులు, డ్రెయిన్ల ఎత్తుపల్లాలు చేయాల్సి ఉంది.
– మండవ వెంకటేశ్వరారావు (సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, అధ్యక్షుడు)

మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి కార్యనిర్వాహక కార్యదర్శిగా జాన్‌పాషా


జానీపాషాకు నియామక పత్రం అందిస్తున్న షారూఖ్ షిబ్లీ

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎం.డి.జానీపాషా నియమితులయ్యారు. మొగల్రాజపురంలోని కార్యాలయంలో ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు షారూఖ్ షిబ్లీ గురువారం పాషాకు నియామక పత్రం అందజేశారు. షిబ్లీ మాట్లాడుతూ ఈ విభాగం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మైనార్టీ ఉద్యోగుల సంక్షేమం, చట్టపరమైన హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తుందని తెలిపారు. పాషా మాట్లాడుతూ మైనార్టీ ఉద్యోగుల సంక్షేమం, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు.


లబ్బీపేట శిర్డీ సాయిబాబా ఆలయంలో..


మొగల్రాజపురం ధనకొండపై..


సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో..


కరెన్సీనగర్: స్టెల్లా కళాశాల సమీప సాయి మందిరంలో..


కరెన్సీనగర్: దాసాంజనేయ ఆలయంలో..


కృష్ణలంకలో...


పటమట: దర్శిపేటలో..


మారుతీనగర్ కోదండరామాలయంలో తమ్మిశెట్టి చక్రవర్తి దంపతులు

చూసిన కనులదే భాగ్యం


సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో గోపూజ


లబ్బీపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

విజయవాడ తూర్పు నియోజకవర్గంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పలుచోట్ల అమ్మవారు బాలాత్రిపుర సుందరీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమ పూజలు, భజనలు చేశారు. లబ్బీపేట శిర్డీసాయిబాబా, లబ్బీపేట వేంకటేశ్వరస్వామి, మొగల్రాజపురంలోని ధనకొండపై ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. బృందావన కాలనీలోని అనంత్ డైమండ్స్ షోరూమ్ ఆధ్వర్యంలో టిక్కిల్ రోడ్డు, బందరురోడ్డులో నాలుగు వేల మంది భక్తులకు ప్రసాదాలు, జ్యూస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. స్టెల్లా కళాశాల సమీపంలోని సాయి మందిరంలో 'శ్రీ బాల పూజ' నిర్వహించారు. మాచవరం దుర్గామల్లేశ్వర దేవాలయంలో దుర్గా మల్లేశ్వరులు, రమా సమేత సత్యనారాయణస్వామిలకు పూజలు చేసినట్లు ధర్మకర్త కలగర బాపినీడు తెలిపారు. నాగార్జున నగర్ శిర్డీసాయి ధ్యాన మందిరంలో భవానీ పూజలు చేశారు. – న్యూస్‌టుడే బృందం


కృష్ణలంక వాసవీ భవనంలో..


పటమటలో..


పటమట పోలీస్ స్టేషన్‌లో..


పటమట శ్రీ మరకత రాజరాజేశ్వరి అమ్మవారు

జమాక్ స్టోర్స్ డైరెక్టర్ల ఎన్నికలు ఏకగ్రీవం


పాలక వర్గాన్ని అభినందిస్తున్న శివనాగేశ్వరరావు, నాగేశ్వరరావు, దుర్గాప్రసాద్ తదితరులు

ఆటోనగర్, న్యూస్‌టుడే: జవహర్ ఆటోనగర్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కన్స్యూమర్ కో-ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్(జమాక్)లో పలు వార్డుల డైరెక్టర్ల పదవులకు గురువారం ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. బొమ్మరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మంగం నాగేశ్వరరావు, గారపాటి సతీష్ బాబు, జాస్తి సురేష్, మహమ్మద్ రిజ్వాన్‌లు డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. వీరిలో ఛైర్మన్‌గా జనాబ్ మహమ్మద్ రిజ్వాన్, సెక్రటరీ మంగం నాగేశ్వరరావు, వైస్ ఛైర్మన్లుగా కొండేపాటి మోహన్‌రావు, జనాబ్ అబ్దుల్ కలాం, జాయింట్ సెక్రటరీలుగా త్రిపురనేని నాగచంద్, వాటపల్లి శ్రీరాములు బాధ్యతలు స్వీకరించారు. ఐలా మాజీ ఛైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, ఆటో క్లస్టర్ ఎం.డి అన్నే శివనాగేశ్వరరావు, జమాక్ స్టోర్స్ మాజీ ఛైర్మన్‌లు కత్తిక శివనాగేశ్వరరావు, సుంకాని వెంకట త్రినాథ్‌లు నూతన పాలక వర్గాన్ని అభినందించారు.

తైక్వాండో క్రీడాకారులకు అభినందన


క్రీడాకారులతో సిస్టర్ అరుణ మేరి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: తిరుపతిలో ఈ నెల 6 నుంచి మూడు రోజులు జరిగే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీలకు తమ పాఠశాలకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారని ప్రసాదంపాడు సెయింట్ ఆన్స్ స్కూల్ ప్రధానోపాధ్యాయిని సిస్టర్ అరుణ మేరి తెలిపారు. ఇటీవల విజయవాడలో జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య(అండర్-14, 17) ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో తమ్ స్కూల్‌కు చెందిన ఎస్.నాగ వెంకట శ్రీనిక, ఎం.మాధవ్‌లు మెరుగైన ప్రతిభను ప్రదర్శించి అండర్-17 జట్టులో స్థానం సాధించారని పేర్కొన్నారు. గురువారం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను, కోచ్ అంకమ్మరావును పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

మార్కెట్ రంగాన్ని అంచనా వేయండి

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: మార్కెట్ రంగాన్ని విద్యార్థులు ఎప్పటికప్పుడు అంచనా వేసుకోవాలని, ఉద్యోగ పోటీల్లో విజయం సాధించడానికి ఆచరణాత్మక నైపుణ్యాలను పొందాలని సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంప్యూటర్ రంగ నిపుణులు సందీప్, నాగరాజులు అన్నారు. ఆంధ్రా లయోలా కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'పర్సనల్ బ్రాండింగ్ అండ్ నెట్‌వర్కింగ్ ఫర్ కెరీర్ సక్సెస్' పేరుతో కార్యశాలను గురువారం కళాశాలలో నిర్వహించారు. విద్యార్థులు నిపుణులు పరస్పర బృంద గోష్ఠి నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ ప్రభు దాస్, సీఎస్ఈ విభాగాధిపతి ఎస్ఏబీ నెహ్రూ, టి.కమలాకర్ రాజు, సమన్వయకర్త అపర్ణలు పర్యవేక్షించారు.

కేశఖండనకు 550 మంది



కేశఖండన శాల వద్ద ఏర్పాటు చేసిన టోకెన్ కౌంటర్లు


మరుగుదొడ్ల ఏర్పాటు


మొక్కు చెల్లించుకుంటున్న భక్తుడు

కృష్ణలంక, న్యూస్‌టుడే: కనకదుర్గమ్మ శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని మొక్కుల చెల్లింపు నిమిత్తం అధికారులు కృష్ణవేణిఘాట్, భవానీ, పున్నమీఘాట్లలో కేశఖండన శాలలు ఏర్పాటు చేశారు. ఈ విధుల నిమిత్తం ఇప్పటికే సుమారు 550 మందిని ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. మూడు కేశఖండన శాలలను ఏర్పాటు చేసినా కృష్ణవేణిఘాట్ వద్ద కేశఖండనశాల విధులకు 270 మందిని కేటాయించినట్లు చెప్పారు. కేశఖండన టోకెన్ ధరను రూ.40లుగా నిర్ధారించినట్లు వెల్లడించిన అధికారులు.. టోకెన్ల విక్రయాలకు నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేశామని, విధుల నిమిత్తం వచ్చిన వారికి ఇక్కడే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం భోజన వసతులు సమకూర్చినట్లు తెలిపారు. విధుల నిమిత్తం దేవాలయాల నుంచి వచ్చిన వారికి టోకెన్‌కు రూ.40, పత్రికా ప్రకటన ద్వారా వచ్చిన వారికి టోకెన్‌కు రూ.25 ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కేశఖండన కోసం వచ్చిన భక్తులు టోకెన్ తప్పించి ఇతరత్రా నగదు మొత్తాన్ని ఇవ్వనవసరం లేదని..ఆ విధంగా వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. కేశఖండనశాల పరిసరాల్లో పురుషులు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం జరిగిందని, తల తడుపుకొనే ఏర్పాటు ఉంటుందని కేశఖండన అనంతరం కృష్ణవేణిఘాట్ వద్ద స్నానాలు చేపట్టాల్సిందిగా సూచించారు. బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి కౌంటర్ల వద్ద పెద్ద మొత్తంలో నీరు నిలిచి బురదతో నిండడంతో నీరు నిలిచిన ప్రదేశాల్లో రబ్బీసు పోయించి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.



ఆటో డ్రైవర్లకు అండగా నిలుస్తాం



కార్యక్రమంలో ఉషారాణి, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, రఘురామరాజు, ఆటోడ్రైవర్లు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: ఎన్ని ఇబ్బందులున్నా ఆటోడ్రైవర్లకు అండగా నిలుస్తామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఎనిమిదో డివిజన్‌లో సర్వీస్ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన అమరావతి ఆటోస్టాండ్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం అనుసరించిన వైఖరి వల్ల కిరాయిలు లేక ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి ఉండదని అన్నీ మంచి రోజులేనని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తే ఆటోడ్రైవర్లు నష్టపోతారని వైకాపా నాయకులు చేస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, అశోక్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే ఆరోగ్యం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: హడ్కో విజయవాడ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో పాఠశాలలు పరిశుభ్రంగా ఉండాలని కోరుతూ కృష్ణా జిల్లా గురువిందపల్లి, అగినపర్రు, ప్రొద్దుటూరు, కంకిపాడు పాఠశాలల్లో తడి, పొడి చెత్త వేయడానికి డస్ట్‌బిన్‌లు వితరణగా ఇచ్చారు. విద్యార్థులకు శుద్ధజల యంత్రాలు అందజేశారు. హడ్కో ప్రాంతీయ కార్యాలయం రీజనల్ చీఫ్ బీఎస్‌ఏ మూర్తి తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలకు ఇచ్చిన డస్ట్‌బిన్లతో హడ్కో ప్రతినిధులు

విశ్రాంత ఉద్యోగులకు అన్ని ప్రయోజనాలు చెల్లించాలి

కృష్ణలంక, న్యూస్‌టుడే: 1981 నుంచి 1983 వరకు తపాలా శాఖలో(ఆర్‌టీపీ) ఉద్యోగులుగా నియమితులై 1988-89లో క్రమబద్ధీకరణ చెంది ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు సర్వీస్ పొందిన వారికి పింఛన్ తదితర ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఆర్టీపీ(రిజర్వ్ ట్రైన్ పూల్) ఉద్యోగులు.. కృష్ణలంకలోని చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయంలో అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ జనరల్ పి.శివవెంకటేశ్వరరావుకు గురువారం వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్, ఉన్నత న్యాయ స్థానాల్లో గెలుపొందినప్పటికీ తమకు రావాల్సిన పింఛన్, ప్రయోజనాలు ఇప్పటి వరకు చెల్లించడం లేదన్నారు. కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, తాడేపల్లిగూడెం, ఏలూరు, మచిలీపట్నం తపాలా డివిజన్ల నుంచి ఉద్యోగులు పాల్గొన్నారు. ఎం.సత్యనారాయణ, ఎ.కృష్ణమోహన్‌రావు, రామలింగేశ్వరరావు, పుల్లేశ్వరరావు, సత్యనారాయణమూర్తి, రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వరద సాయం హామీల అమలుకు డిమాండ్

కృష్ణలంక, న్యూస్‌టుడే: రియల్ టైం గవర్నెన్స్ గురించి మాట్లాడుతున్న కూటమి ప్రభుత్వం 33 రోజులు గడుస్తున్నా వరద బాధితులందరికీ సహాయం అందించడంలో వైఫల్యం చెందినట్లుగా సీపీఎం నాయకులు ఆరోపించారు. వరద బాధితులందరికీ న్యాయం చేయాలంటూ కలెక్టరేట్ వద్ద గురువారం సీపీఎం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించి డీఆర్వో శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, నేతలు డీవీ కృష్ణ, దోనేపూడి కాశీనాథ్‌లో మాట్లాడుతూ ఇప్పటికీ వేలాది మంది వరద బాధితులు సహాయం అందక కార్యాలయాలు, ప్రజాప్రతినిధులు చుట్టూ తిరుగుతున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం 95 శాతం బాధితులకు సహాయం అందించినట్లు ప్రకటనలు చేయడం శోచనీయం అన్నారు. అందరికీ సహాయం అందితే వేలమంది కార్యాలయాల వద్ద వచ్చి ఎందుకు దరఖాస్తులు ఇస్తున్నారో ప్రభుత్వం అలోచించాలన్నారు. ప్రతి ఒక్క బాధితుడిని ఆదుకుంటామన్న ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలుపర్చాలన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని రూ.7వేల కోట్లు వరద సహాయం కోరినప్పటికీ అన్ని రాష్ట్రాలకు ఇచ్చిన విధంగా అడ్వాన్స్ ఇచ్చి చేతులు దులుపుకుంటున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా 5వ తేదీ లోగా సహాయం అందించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.



ధర్నా చేస్తున్న బాబూరావు, కాశీనాథ్ తదితరులు

కార్ల షోరూమ్‌లో అగ్నిప్రమాదం

పటమట, న్యూస్‌టుడే: మహానాడు రోడ్డు సమీపంలోని ఓ కార్ల షోరుమ్‌లో బుధవారం అర్ధరాత్రి 2 గంటలకు అగ్నిప్రమాదం జరిగింది. సర్వీసింగ్‌కి ఇచ్చిన 9 వాహనాలు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం సంభవించి ఉండవచ్చని భావిస్తున్నారు. ఘటనపై ఎటువంటి ఫిర్యాదులు అందలేదని పటమట పోలీసులు తెలిపారు.

In The Court Of The VIIIth Addl. District Judge
(S.C, S.T COURT), ELURU
O.S.No. 65/2022

Between
Shame Rahman - Plaintiff
And
Mohammad Ehasen-Ul-Haqu and Others - Defendants

D1. Mohammad Ehasen-Ul-Haqu, S/o. Jawahar-Ul-Haqu (Muslim) Male, Aged 65 Years, D.No. 59/A-8/10-7/A, Road No.2, (Muslim Street), Labbipeta, Vijayawada, Krishna District (NTR District)
D2. Shaik Bakshu Ahmed, S/o. Pakeer Ahmed, Muslim, Male, Aged 58 Years, D.No.7/A-8/10-7/A, Road No.2, (Muslim Street), Labbipeta, Vijayawada, Krishna Dt (NTR Dt)
D3. Mohammad Haneeb, S/o. Kasim Saheb, Muslim, Male Aged 77 Years, D.No. 78A-8/10-7/A, Road No.2, (Pejjini peta), (Muslim Street), Vijayawada, Krishna Dt (NTR Dist)
D4. Abdul Jabbar, S/o.Shaik Masthan, Muslim, Male, Aged 55 Years, D.No.78A-8/10-7/A, Road No.2, (Pejjini Peta)(Muslim Street), Vijayawada Krishna Dt (NTR Dt)

పై నెంబరు గల Defendants 1to 4 లకు ఎన్నిసార్లూ కోర్టు నోటీసులు పంపిన పుచ్చుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు నోటీసులు అమలు నిమిత్తం Paper Publication Ads వేసినారు. కావున పై వారికి ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు ఎదుట **dt. 14/10/2024** నాడు ఉదయం గం|| 10-30 ని||లకు హాజరు కావలెను. లేనిచో మీ పరోక్షము నందు విచారించి తీర్మానించబడునని తెలియచేయడమైనది.

ఏలూరు. సం/- **నెక్కరగంటి నరసింహారావు,**
03-10-2024 అడ్వకేట్, ఏలూరు.

In The Court Of The VIIIth Addl. District Judge
(S.C, S.T COURT), ELURU
I.A. No. 732/2022 O.S.No. 65/2022

Between
Shame Rahman - Petitioner
And
Mohammad Ehasen-Ul-Haqu and Others - Respondent

R1. Mohammad Ehasen-Ul-Haqu, S/o. Jawahar-Ul-Haqu (Muslim) Male, Aged 65 Years, D.No. 59/A-8/10-7/A, Road No.2, (Muslim Street), Labbipeta, Vijayawada, Krishna District (NTR District)
R2. Shaik Bakshu Ahmed, S/o. Pakeer Ahmed, Muslim, Male, Aged 58 Years, D.No.7/A-8/10-7/A, Road No.2, (Muslim Street), Labbipeta, Vijayawada, Krishna Dt (NTR Dt)
R3. Mohammad Haneeb, S/o. Kasim Saheb, Muslim, Male Aged 77 Years, D.No. 78A-8/10-7/A, Road No.2, (Pejjini peta), (Muslim Street), Vijayawada, Krishna Dt (NTR Dist)
R4. Abdul Jabbar, S/o.Shaik Masthan, Muslim, Male, Aged 55 Years, D.No.78A-8/10-7/A, Road No.2, (Pejjini Peta)(Muslim Street), Vijayawada Krishna Dt (NTR Dt)

పై నెంబరు గల (I.A. 732/2022) Respondent 1 to 4లకు ఎన్నిసార్లూ కోర్టు నోటీసులు పంపిన పుచ్చుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు నోటీసులు అమలు నిమిత్తం పేపరు ప్రకటన అర్డరు వేసినారు. కావున పై వారికి ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు ఎదుట **dt. 14/10/2024** నాడు ఉదయం గం|| 10-30 ని||లకు హాజరు కావలెను. లేనిచో మీ పరోక్షము నందు విచారించి తీర్మానించబడునని తెలియచేయడమైనది.

ఏలూరు. సం/- **నెక్కరగంటి నరసింహారావు,**
03-10-2024 అడ్వకేట్, ఏలూరు.

విజయవాడ పశ్చిమ

శ్రీదుర్గా భవానీ నామ సంకీర్తనల సీడీ ఆవిష్కరణ


ఆవిష్కరించిన మంత్రులు రామనారాయణరెడ్డి, పార్థసారథి, ఈవో తదితరులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: కనకదుర్గమ్మ అమ్మవారి భక్తి భావంతో హైదరాబాద్‌కి చెందిన గరికపాటి వెంకట ప్రభాకర్ ఆలపించిన శ్రీదుర్గా భవానీ నామ సంకీర్తనల ఆడియో సీడీలను దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి గురువారం ఇంద్రకీలాద్రిపై ఆవిష్కరించారు. సంకీర్తనలను మంత్రులు ఆలపించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, ఈవో కె.ఎస్.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు.. కాలుతున్న కాళ్లు

చిట్టినగర్, న్యూస్‌టుడే : దేవీ శరన్నవరాత్రుల నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గ అమ్మవారి దేవాలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. ఎండతీవ్రతతో దర్శనానికి వచ్చే భక్తుల కాళ్లు కాలిపోతున్నాయి. నడవలేని పరిస్థితి. కొందరికి బొబ్బలు కూడా వచ్చాయి. క్యూ మార్గంలో వెళ్లి జగన్మాతను దర్శించుకొని భక్తులు కొండ దిగుతున్నారు. కొండ దిగి మహామండపం నుంచి రథం సెంటర్‌కి వెళ్లే మార్గంలో కాళ్లు కాలకుండా నేల పట్టాలు వేయలేదు. మహామండపం నుంచి ప్రసాదాల కౌంటర్ల వరకు నడుచుకుంటూ వెళ్లే వారు కాళ్లు కాలుతూ నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తగిన చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.


నేల పట్టాలు ఏర్పాటు చేయాల్సిన కనకదుర్గనగర్ ఇదే

వీఐపీలకు చక్కటి సేవలు

భవానీపురం, న్యూస్‌టుడే : దసరా నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే వీఐపీలకు సేవలు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పున్నమి ఘాట్ వద్ద వీఐపీల కోసం ప్రత్యేకంగా హాల్ మాదిరిగా ఉండే టెంట్ వేశారు. ఎండవేడిమికి ఇబ్బంది పడకుండా ఏసీలు అమర్చారు. కుటుంబసమేతంగా వచ్చే వారికి ఇబ్బందులు తలెత్తకుండా, ఇంద్రకీలాద్రి మీదకు వెళ్లేందుకు ఆలస్యమైనా కూర్చునేందుకు వీలుగా సోఫాలు ఏర్పాటు చేశారు. మంత్రులు, ఎంపీలు, శాసనసభ్యులు, న్యాయమూర్తులు, ఇలా... వీఐపీల కోసం ఈ సౌకర్యం కల్పించారు. వీఐపీల వివరాలను నమోదు చేసుకుని కారులో కొండ మీదకు పంపుతున్నారు.


లోపల కూర్చునేందుకు వీలుగా సోఫాలు


వీఐపీల కోసం టెంట్

డ్రోన్ల సాయంతో పారిశుద్ధ్య పర్యవేక్షణ

భవానీపురం, న్యూస్‌టుడే: దసరా నవరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. దసరా నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను కమిషనర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధ్యానచంద్ర మాట్లాడుతూ ఇంద్రకీలాద్రి పరిధిలో చెత్త, వ్యర్థాలు ఎక్కడ ఉన్నాయో అనే విషయాన్ని డ్రోన్ సాయంతో తెలుసుకోవడం జరుగుతుందన్నారు. వ్యర్థాలు ఉన్న విషయాన్ని అధికారులకు తెలిపి శుభ్రం చేయిస్తామన్నారు. సీతమ్మ వారి పాదాలు, వినాయకుని గుడి, రథం సెంటర్, దుర్గగుడి పరిసరాల్లో కమిషనర్ పర్యటించి ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.


మరుగుదొడ్లు పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

5, 6 తేదీల్లో బస్‌పాస్ కౌంటర్ల పనిచేయవు

విజయవాడ బస్‌స్టేషన్, న్యూస్‌టుడే : ఏపీఎస్ ఆర్టీసీ సాఫ్ట్‌వేర్ ఆధునికీకరణ చేస్తున్నందున ఏపీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్ రెండురోజులపాటు పనిచేయదని జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.వై దానం గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5, 6 తేదీల్లో అన్ని రకాల బస్‌పాస్ కౌంటర్లు పనిచేయవన్నారు. 7వ తేదీ నుంచి బస్‌పాసులు అందిస్తామని పేర్కొన్నారు. ప్రయాణికులు, విద్యార్థులు గమనించాలని కోరారు.

అద్భుతం అమ్మ దర్శనం

భక్తుల సంతృప్తి



చిట్టినగర్, న్యూస్‌టుడే

ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాతను దర్శించుకునేందుకు భక్తులు తరలివస్తున్నారు. గురువారం కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి దగ్గర నుంచి క్యూ మార్గం ద్వారా ఇంద్రకీలాద్రికి చేరుకున్న భక్తులు శ్రీ బాలా త్రిపురసుందరీదేవి అలంకారంలో కొలువైన అమ్మవారిని దర్శించుకొని తరించారు. అనంతరం మెట్ల మార్గంలో కిందకు దిగారు. అమ్మదర్శనం, ఏర్పాట్లు, అన్నప్రసాదం వితరణ వంటి అంశాలపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తూ తమ అభిప్రాయాలను 'న్యూస్‌టుడే'తో ఇలా పంచుకున్నారు.


అమ్మ దర్శనం కోసం క్యూలైన్లలో భక్తులు

అరగంటలో అమ్మ దర్శనం



క్యూ మార్గంలో అమ్మ సన్నిధికి చేరుకున్నాను. దుర్గమ్మ నామస్మరణతో ముందుకు సాగాం. కొండపైకి చేరుకోగానే ఉత్సవ వాతావరణం అబ్బుర పరిచింది. అమ్మవారిని దర్శించుకోగానే ఏదో తెలియని అనుభూతి చెందాను. అర గంటలో అమ్మ దర్శనం అయ్యింది. ఎక్కడా ఇబ్బంది పడలేదు. ఏర్పాట్లు చాలా బాగున్నాయి.

- కె.రమణ, కృష్ణలంక

అన్నప్రసాదం బాగుంది



దసరా ఏర్పాట్లు బాగున్నాయి. కొండపైకి చేరుకోగానే సందడి వాతావరణంతో ముచ్చటేసింది. అమ్మ సన్నిధికి చేరుకోగానే మనసు ప్రశాంతత అనిపించింది. జగన్మాతను దర్శించుకుని తరించాను. కొండ దిగువన అన్నప్రసాదం స్వీకరించాను. చాలా బాగుంది. ఏర్పాట్లు చూసి 9 రోజుల పాటు వచ్చి అమ్మను దర్శించుకోవాలనే ఆకాంక్ష పెరిగింది.

- ఎం.రామిరెడ్డి, భవానీపురం

వాలంటీర్ల సేవలు బాగు



వినాయకుడిగుడి నుంచి క్యూలైన్లలో ఇంద్రకీలాద్రికి చేరుకున్నాం. ఎండ తీవ్రతతో విపరీతమైన దాహం వేసింది. అడుగడుగునా వాలంటీర్లు తాగునీరు అందించిన తీరు బాగుంది. ఎక్కడా మాకు అలుపు అనిపించలేదు. ఆధ్యాత్మిక వాతావరణం ఉంది. ఉత్సవ ఏర్పాట్లు బాగున్నాయి. మా కుటుంబ సభ్యులం అన్నప్రసాదం స్వీకరించాం. **- పి.ధనలక్ష్మి, ఆంజనేయవాగు**

గతంతో పోలిస్తే..



నేను ప్రసాదంపాడు నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చాను. క్యూలైన్ల ఎటువంటి ఇబ్బంది లేకుండా కొండపైకి చేరుకున్నా. ప్రధానాలయంలో వాతావరణం కనుల పండువగా ఉంది. అమ్మ రూపం చూసి తరించాను. అన్నప్రసాదం స్వీకరించాను. గతంతో పోలిస్తే ఉత్సవ ఏర్పాట్లు చాలా అద్భుతంగా చేశారు. వాలంటీర్లు సేవలు బాగున్నాయి. **- శివకృష్ణప్రసాద్, ప్రసాదంపాడు**

ఇంద్రకీలాద్రిపై ఆకట్టుకున్న లేజర్ షో!




డ్రోన్ దృశ్యాలు: కాంతులీనుతున్న ఇంద్రకీలాద్రి

దసరా వేడుకలను పురస్కరించుకొని శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం మహిషాసుర సంహారం లేజర్ షోను గురువారం రాత్రి ప్రదర్శించారు. మహిషాసురుడు బ్రహ్మదేవును గురించి తపస్సు చేయడం, వరాలను కోరడం, దేవతలపై దండయాత్ర, తరువా మహిషాసురుని జగన్మాత దుర్గమ్మ యుద్ధంలో వధించిన వైనాన్ని లేజర్ షో భక్తులను ఆకట్టుకునే విధంగా వివరించింది.

- ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే


అలరించిన నృత్య ప్రదర్శన


నవహారతులు ఇస్తున్న వేదపండితులు




మహిషాసుర సంహారం లేజర్ షో


గ్రామోత్సవంలో వాయిద్యకారుల ప్రదర్శన

స్వచ్ఛంద సంస్థల సేవలు సంతోషకరం


ఊర్మిళానగర్ వాసులకు సరకులు ఇస్తున్న శాసనసభ్యుడు సుజనాచౌదరి

భవానీపురం, న్యూస్‌టుడే: వరద బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం సంతోషకరమని పశ్చిమ శాసనసభ్యుడు సుజనా చౌదరి పేర్కొన్నారు. ఎస్‌బీఐ కార్డ్, రౌండ్ టేబుల్ ఇండియా ఆధ్వర్యంలో ఊర్మిళానగర్ వాసులకు నిత్యావసర సరకులను అందించే కార్యక్రమం ఊర్మిళానగర్‌లోని ఓ కల్యాణ మండపంలో గురువారం జరిగింది. వరదల సమయంలో సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలోనూ సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. 1800 మందికి సరకులు అందించారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు రౌండ్‌టేబుల్ ఇండియా ఛైర్మన్ మక్సూర్ అహ్మద్, వైస్ ఛైర్మన్ యక్కల కౌషిక్, ప్రతినిధులు యండూరి అశ్విన్, కాళూరి శ్రీకర్, నాదెళ్ళ ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళం


మంత్రి సవితకు చెక్కు అందజేస్తున్న ఏపీ బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ నాయకులు ఎల్లారావు, కొండలరావు

విద్యాధరపురం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి సహాయ నిధికి ఏపీ బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ రూ. లక్ష విరాళాన్ని గురువారం అందజేశారు. రాష్ట్ర మంత్రి సవితను కలిసి ఫెడరేషన్ అధ్యక్షుడు బి.వి.వి. కొండలరావు నేతృత్వంలో సభ్యులు చెక్కును అందజేశారు. ఫెడరేషన్ నాయకులు ఎల్లారావు, వీరారెడ్డి, జగన్మోహనరావు, నరేంద్రదేవ్ పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడు కనకారావు మృతి

చిట్టినగర్, న్యూస్‌టుడే: సీపీఐ నాయకులు, ముఠా కార్మిక సంఘం నాయకులు కొరగంజి కనకారావు(84) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. ఆంజనేయవాగులోని ఆయన గృహం వద్ద ఉన్న మృతదేహానికి సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలిపారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, తాడి పైడయ్య, సాంబశివరావు, దుర్గాంబ, మాజీ కార్పోరేటర్ రమణబాబు, చింతాడ పార్వతి ఉన్నారు.


చిట్టినగర్‌లోని మహాలక్ష్మి అమ్మవారు


కలరా ఆసుపత్రి సెంటర్‌లోని కనకదుర్గమ్మ


పాలఫ్యాక్టరీ వద్ద ఆలయంలో విజయదుర్గా మాత


దాసాంజనేయ ఆలయంలో శ్రీబాలాత్రిపురసుందరీదేవిగా


పాత శివాలయంలో రజిత కవచాలంకృత భ్రమరాందేవి అలంకారం

అమ్మవారికి భక్తజన నీరాజనాలు

చిట్టినగర్, న్యూస్‌టుడే: దేవీశరన్నవరాత్రుల మహోత్సవాలు పలు ఆలయాల్లో గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలంకరణలతో ఆలయాలు శోభిల్లాయి. భక్తులు ఆలయాలకు తరలి వచ్చి అమ్మవార్లను వివిధ రూపాల్లో దర్శించుకున్నారు. చిట్టినగర్‌లోని శ్రీనగరాల సీతారామ స్వామి మహాలక్ష్మి (కొత్త)అమ్మవారి ఆలయంలో తొలి రోజు మహాలక్ష్మి అమ్మవారుగా భక్తులకు దర్శనం ఇచ్చారు. పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు.

★ పాలఫ్యాక్టరీ వద్ద ఉన్న శ్రీవిజయదుర్గా రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో విజయదుర్గ అమ్మవారుగా భక్తులకు దర్శనం అందించారు. కేఎల్‌రావు నగం వీఎంసీకాలనీలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో, భీమనవారిపేట గంగానమ్మ అమ్మవారి ఆలయంలో, దాసాంజనేయస్వామి ఆలయంలో బాలా త్రిపురసుందరీదేవిగా అలంకరించారు. కొత్తపేట కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో రుద్ర సహిత ద్విశత చండీయాగం నిర్వహించారు.


చిట్టినగర్ అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే సుజనా చౌదరి


మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావుకు సత్కారం


మహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో మేయర్ భాగ్యలక్ష్మి


హెచ్‌బీ కాలనీ సంకల్పసిద్ధి శ్రీ శిర్డీ సాయి బాబా మందిరంలో మహిళల పూజలు

నిత్యావసర వస్తువుల అందజేత

విద్యాధరపురం, న్యూస్‌టుడే: వరదల కారణంగా తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందిన రావిచెట్టు సెంటరు ఆళ్ల సింహాద్రి వీధికి చెందిన తాడెపు కోటేశ్వరరావు కుటుంబానికి వరద సాయం అందలేదని తెలిసి అమ్మ సేవ చారిటబుల్ ట్రస్టు తరపున బియ్యం బస్తా, నిత్యావసర వస్తువులను ఆర్.మాధవ్ అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినా 38వ డివిజను ఆళ్ల సింహాద్రి వీధిలో వరదబాధితుల ఎన్యుమరేషను చేయక పోవడంతో నష్టపరిహారం అందలేదని బాధిత కుటుంబాలు వాపోయాయి. కోటేశ్వరరావు మనవడు, మనవరాలి వినికిడి మిషన్లు పాడైపోవడంతో పాఠశాలకు కూడా వెళ్లలేకపోతున్నారని ప్రభుత్వ అధికారులు, దాతలు సాయం అందించాలని కోటేశ్వరరావు కుటుంబ సభ్యులు స్థానిక నాయకులు శాంతి ట్రస్టు నిర్వాహకులను కోరారు.

ప్రజల కష్టాలు తీర్చే శక్తి ఇవ్వాలి..

చిట్టినగర్: రాష్ట్ర ప్రజల కష్టాలు తీర్చి.. ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు జగన్మాత దుర్గమ్మ ముఖ్యమంత్రి చంద్రబాబుకు శక్తియుక్తులు ఇవ్వాలని వేడుకున్నట్లు రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన మేరకు ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు దేవాదాయశాఖ మంత్రి అనేక దఫాలుగా సమీక్షించారన్నారు. గతంలో ఎదుర్కొన్న సమస్యలను అధిగమించి, తగిన ఏర్పాట్లు చేయడం శుభపరిణామమన్నారు. దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.విజయశేఖర్‌బాబు అమ్మవారిని దర్శించుకున్నారు.

పరిశుభ్రంగా స్నానఘాట్‌లు

భవానీపురం, న్యూస్‌టుడే: కృష్ణానది ఒడ్డున ఉన్న స్నానఘాట్‌లను పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పున్నమి, భవానీ స్నానఘాట్‌ల వద్దకు భక్తులు వస్తున్నారు. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున పారిశుద్ధ్య సిబ్బందిని నియమించి ఘాట్ వద్ద పరిశుభ్రత చర్యలు చేపడుతున్నారు. ఘాట్ మెట్లను నీటితో శుభ్రం చేస్తున్నారు. చెత్తను ఎప్పటికప్పుడు తీయించి శుభ్రంగా ఉంచుతున్నారు. భక్తుల కోసం జల్లు స్నానాలు, కేశఖండన శాల, వైద్యశిబిరాలు, క్లోక్‌రూం, తదితర సౌకర్యాలను కల్పించారు.


పున్నమిఘాట్ వద్ద జల్లు స్నానాలు


శుభ్రం చేస్తున్న సిబ్బంది

ఉత్సవాల తొలి రోజు ఆదాయం రూ.20.25లక్షలు

ఇంద్రకీలాద్రి: దసరా ఉత్సవాల్లో తొలి రోజు గురువారం దర్శనం టిక్కెట్లు, ప్రసాదాల విక్రయం తదితర సేవల ద్వారా రూ. 20,25,000 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం ఈవో రామారావు ప్రకటించారు. రూ. 500ల దర్శన టిక్కెట్ల ద్వారా రూ. 8,65,000, రూ. 300 టిక్కెట్ల ద్వారా 3,15,000, రూ. 100 టిక్కెట్ల ద్వారా రూ. 2,40,00 ఆదాయం లభించింది. లడ్డూ ప్రసాదాల విక్రయాలతో రూ. 5,25,000, కేశఖండన టిక్కెట్ల ద్వారా రూ. 50, ఆర్జిత సేవల నుంచి రూ. 27,000 ఆదాయం వచ్చినట్లు ఈవో పేర్కొన్నారు.

కేశఖండనకు 550 మంది

కృష్ణలంక, న్యూస్‌టుడే: కనకదుర్గమ్మ శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని మొక్కుల చెల్లింపు నిమిత్తం అధికారులు కృష్ణవేణిఘాట్, భవానీ, పున్నమీఘాట్లలో కేశఖండన శాలలు ఏర్పాటు చేశారు. ఈ విధుల నిమిత్తం ఇప్పటికే సుమారు 550 మందిని ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. మూడు కేశఖండన శాలలను ఏర్పాటు చేసినా కృష్ణవేణిఘాట్ వద్ద కేశఖండనశాల విధులకు 270 మందిని కేటాయించినట్లు చెప్పారు. కేశఖండన టోకెన్ ధరను రూ. 40లుగా నిర్ధారించినట్లు వెల్లడించిన అధికారులు.. టోకెన్ల విక్రయాలకు నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేశామని, విధుల నిమిత్తం వచ్చిన వారికి ఇక్కడే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం భోజన వసతులు సమకూర్చినట్లు తెలిపారు. విధుల నిమిత్తం దేవాలయాల నుంచి వచ్చిన వారికి టోకెన్‌కు రూ. 40, పత్రికా ప్రకటన ద్వారా వచ్చిన వారికి టోకెన్‌కు రూ. 25 ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కేశఖండన కోసం వచ్చిన భక్తులు టోకెన్ తప్పించి ఇతరత్రా నగదు మొత్తాన్ని ఇవ్వనవసరం లేదని..ఆ విధంగా వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. కేశఖండనశాల పరిసరాల్లో పురుషులు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం జరిగిందని, తల తడుపుకొనే ఏర్పాటు ఉంటుందని కేశఖండన అనంతరం కృష్ణవేణిఘాట్ వద్ద స్నానాలు చేపట్టాల్సిందిగా సూచించారు. బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి కౌంటర్ల వద్ద పెద్ద మొత్తంలో నీరు నిలిచి బురదతో నిండడంతో నీరు నిలిచిన ప్రదేశాల్లో రబ్బీసు పోయించి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.


మొక్కు చెల్లించుకుంటున్న భక్తుడు


మరుగుదొడ్ల ఏర్పాటు

విజయవాడ మధ్య

శిర్డీ సాయిబాబా పుణ్యతిథి ఉత్సవాలు

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే : ముత్యాలంపాడులోని శిర్డీ సాయి బాబా మందిరంలో గురువారం బాబా పుణ్యతిథి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వీటిని ఈ నెల 13వ తేదీ వరకు నిర్వహిస్తామని మందిర గౌరవ వ్యవస్థాపకుడు పి.గౌతమ్‌రెడ్డి తెలిపారు. ప్రతి రోజూ బాబాకు సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో అభిషేకం ఉంటుంది. సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తారు. తొలి రోజు అభిషేకం చేశారు. సాయంత్రం నాట్యాచార్యులు చింతా శివరామకృష్ణకుమార్, నాట్యాచారిణులు కావ్య, భాగవతుల సౌమ్య శిష్య బృందాల కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి.


అలంకరణలో బాబా

లేపాక్షి కూడలిలో ట్రాఫిక్

విజయవాడ నేరవార్తలు: గాంధీనగర్ లేపాక్షి కూడలిలో రోడ్డు మలుపులో అడ్డగోలుగా నిలిపిన కారు ట్రాఫిక్ సమస్య సృష్టించింది. అలంకార్ కూడలి వైపు నుంచి సత్యనారాయణపురం వైపు ఆర్టీసీ బస్సులు లేపాక్షి కూడలి మీదుగా వెళుతుంటాయి. ఇక్కడి మలుపులోనే గురువారం రాత్రి ఓ వ్యక్తి కారు నిలిపి వెళ్లిపోయారు. బస్సు మలుపు తిరగలేక నిలిచిపోయింది. ఈ లోగా మరో బస్సు వచ్చి ఆగింది. చిన్న ఖాళీలో మరో కారు ముందుకు వచ్చేయడంతో రాకపోకలు స్తంభించాయి. పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. చేసేది ఏమీ లేక బస్సు కండక్టర్లు కిందకు దిగి ట్రాఫిక్‌ను సరిచేస్తున్నారు. దాదాపు 20 నిమిషాల తరవాత వాహనాలు కదిలాయి. అప్పటి వరకు కారు యజమాని రాలేదు. ప్రతి రోజూ ఇక్కడే కొందరు కార్లు నిలిపి వెళ్లిపోతుండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు దీనిపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.


మలుపులో నిలిపిన కారుతో ఇబ్బందులు (వృత్తంలో)

'కొండా సురేఖ అనుచిత వ్యాఖ్యలు తగదు'

గాంధీనగర్, న్యూస్‌టుడే : తెలంగాణ మంత్రి కొండా సురేఖ అక్కినేని కుటుంబంపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆలిండియా అక్కినేని నాగార్జున యువసేన అధ్యక్షుడు ఎన్.సర్వేశ్వరరావు డిమాండ్ చేశారు. మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం గాంధీనగర్‌లో అభిమానులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్‌పై కోపం ఉంటే రాజకీయంగా విమర్శించుకోవాలని సూచించారు. సంబంధం లేని అక్కినేని కుటుంబంపై మాట్లాడడం సరికాదని, ఆమె క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టి.శేఖర్, బి.కృష్ణ, కె.ప్రభాకర్, సత్యం, ఎం.విజయకృష్ణ, చిన్ని, బాషా తదితరులు పాల్గొన్నారు.

గ్రంథావిష్కరణ

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే : పండితుడు క్రోవి పార్థసారథి రచించిన విద్యామంత్ర సాధన గ్రంథం.. శ్రీవిద్య ఉపాసకులకు ఎంతగానో ఉపయోగపడుతుందని విశ్రాంత ఆచార్యులు పొన్నలూరి లక్ష్మణరావు, కరివెన వారి సత్యసముదాయాల అధ్యక్షుడు చెట్లపల్లి మారుతీ ప్రసన్నలు అన్నారు. గురువారం సత్యనారాయణపురంలో నిర్వహించిన గ్రంథావిష్కరణలో వారు పాల్గొన్నారు. రచయిత మాట్లాడుతూ.. శ్రీవిద్యను వివరించి, ప్రతి ఒక్కరూ సులువుగా తెలుసుకునే ఈ గ్రంథం రచించినట్లు తెలిపారు.

అద్భుతం అమ్మ దర్శనం

భక్తుల సంతృప్తి వ్యక్తం



చిట్టినగర్, న్యూస్‌టుడే

ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాతను దర్శించుకునేందుకు భక్తులు తరలివస్తున్నారు. గురువారం కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి దగ్గర నుంచి క్యూ మార్గం ద్వారా ఇంద్రకీలాద్రికి చేరుకున్న భక్తులు శ్రీ బాలా త్రిపురసుందరీదేవి అలంకారంలో కొలువైన అమ్మవారిని దర్శించుకొని తరించారు. అనంతరం మెట్ల మార్గంలో కిందకు దిగారు. అమ్మదర్శనం, ఏర్పాట్లు, అన్నప్రసాదం వితరణ వంటి అంశాలపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తూ తమ అభిప్రాయాలను 'న్యూస్‌టుడే'తో ఇలా పంచుకున్నారు.


అమ్మ దర్శనం కోసం క్యూలైన్లలో భక్తులు

అరగంటలో దర్శనం



క్యూ మార్గంలో అమ్మ సన్నిధికి చేరుకున్నాను. దుర్గమ్మ నామస్మరణతో ముందుకు సాగాం. కొండపైకి చేరుకోగానే ఉత్సవ వాతావరణం అబ్బురపరిచింది. అమ్మవారిని దర్శించుకోగానే ఏదో తెలియని అనుభూతి చెందాను. అర గంటలో అమ్మ దర్శనం అయ్యింది. ఎక్కడా ఇబ్బంది పడలేదు. ఏర్పాట్లు చాలా బాగున్నాయి.

- కె.రమణ, కృష్ణలంక

అన్నప్రసాదం బాగుంది



దసరా ఏర్పాట్లు బాగున్నాయి. కొండపైకి చేరుకోగానే సందడి వాతావరణంతో ముచ్చటేసింది. అమ్మ సన్నిధికి చేరుకోగానే మనసు ప్రశాంతత అనిపించింది. జగన్మాతను దర్శించుకుని తరించాను. కొండ దిగువన అన్నప్రసాదం స్వీకరించాను. చాలా బాగుంది. ఏర్పాట్లు చూసి 9 రోజుల పాటు వచ్చి అమ్మను దర్శించుకోవాలనే ఆకాంక్ష పెరిగింది.

- ఎం.రామిరెడ్డి, భవానీపురం

వాలంటీర్ల సేవలు బాగు



వినాయకుడిగుడి నుంచి క్యూలైన్లలో ఇంద్రకీలాద్రికి చేరుకున్నాం. ఎండ తీవ్రతతో విపరీతమైన దాహం వేసింది. అడుగడుగునా వాలంటీర్లు తాగునీరు అందించిన తీరు బాగుంది. ఎక్కడా మాకు అలుపు అనిపించలేదు. ఆధ్యాత్మిక వాతావరణం ఉంది. ఉత్సవ ఏర్పాట్లు బాగున్నాయి. మా కుటుంబ సభ్యులం అన్నప్రసాదం స్వీకరించాం. **- పి.ధనలక్ష్మి, అంజనేయవాగు**

బాగా చేశారు



నేను ప్రసాదంపాడు నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చాను. క్యూలైన్ల ఎటువంటి ఇబ్బంది లేకుండా కొండపైకి చేరుకున్నా. ప్రధానాలయంలో వాతావరణం కనుల పండువగా ఉంది. అమ్మ రూపం చూసి తరించాను. అన్నప్రసాదం స్వీకరించాను. గతంతో పోలిస్తే ఉత్సవ ఏర్పాట్లు చాలా అద్భుతంగా చేశారు. వాలంటీర్ల సేవలు బాగున్నాయి.

- శివకృష్ణప్రసాద్, ప్రసాదంపాడు

సంబరం.. ఆరంభం..!


గవర్నర్‌పేట కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో రజత కవచాలంకృత అన్నపూర్ణాదేవి అలంకారం


మధురానగర్‌లోని బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో దుర్గాదేవిగా రాజరాజేశ్వరీదేవి


గద్దె వెంకట్రామయ్యనగర్‌లో బాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో..


సత్యనారాయణపురంలో..


అయోధ్యనగర్‌లో..


ముత్యాలంపాడులో రజత కవచాలంకృత పార్వతీదేవిగా


సూర్యారావుపేటలో స్వర్ణ ప్రభ మహోత్సవ కమిటీ దసరా ఉత్సవాల్లో బాలస్వామి తదితరులు


బీసెంట్ రోడ్డులోని రామాలయం వద్ద అమ్మవారికి పూజలు..

గవర్నర్‌పేట, మధురానగర్, న్యూస్‌టుడే : నగరంలో దసరా శరన్నవ రాత్రులు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవాలయాలు, ప్రత్యేక మందిరాల్లో తొలి రోజు.. దుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమ పూజలు నిర్వహించారు. బీసెంట్‌రోడ్డులోని అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా తీర్చిదిద్దారు. గవర్నర్‌పేటలోని కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో అమ్మవారిని రజత కవచాలంకృత అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ఈవో సీతారామయ్య ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సూర్యారావుపేట సూర్యనారాయణవీధిలో స్వర్ణప్రభ మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలకు తెదేపా ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి హాజరయ్యారు. కమిటీ సభ్యులు శ్రీరంగ, కృష్ణారెడ్డి, తాండవ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

★ మధురానగర్‌లోని స్వయంభువు బాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో రాజరాజేశ్వరీపేటని స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా అలంకరించారు. ధర్మకర్త బోయిన గోపాలకృష్ణ, శ్యామల దంపతుల ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభించారు. గద్దె వెంకట్రామయ్యనగర్‌లోని వేదికపై 15వ దసరా ఉత్సవాలను స్థానికులు ఆరంభించారు. అమ్మవారిని బాలా త్రిపురసుందరీదేవిగా అలంకరించారు.

సత్యనారాయణపురం : సత్యనారాయణపురంలోని అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అయోధ్యనగర్ శివకామేశ్వరి సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. పంచామృత అభిషేకం చేశారు. శతచండీయాగం నిర్వహించారు. ముత్యాలంపాడులో పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలోని అమ్మవారిని రజత కవచాలంకృత పార్వతీదేవిగా అలంకరించారు. కుంకుమ పూజలు చేశారు.

దుర్గగుడి ఉత్సవ కమిటీ సభ్యుడిగా గార్లపాటి


విజయకుమార్

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే : నగరంలో ఇంద్రకీలాద్రిపై అమ్మవారి దసరా నవరాత్రి మహోత్సవాలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవ కమిటీలో సభ్యుడిగా సత్యనారాయణపురానికి చెందిన గార్లపాటి విజయకుమార్ నియమితులయ్యారు. ఈయన తెదేపా 33వ డివిజన్ ఇంఛార్జిగా పనిచేస్తున్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రకటన

నా క్లయింటు ఎన్.టి.ఆర్. జిల్లా విజయవాడ 1టౌన్‌లోని గణపతిరావు రోడ్డు కాపురస్తురాలు పులిపాటి చిన సుబ్బారావు గారి భార్య పద్మావతి గారినుండి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా... ఎన్.టి.ఆర్. జిల్లా విజయవాడ గాంధీనగర్ వాస్తవ్యులు వేల్పూరు (లేటు) రామకృష్ణారావుగారి కుమారుడు విజయకిరణ్ గార్కి ది. 15-4-2004వ తేదీ విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి కార్యాలయములో దస్తావేజు నెం. 6714 of 2004 రుగా రిజిష్టరు పార్టీషన్ దస్తావేజు ద్వారా హక్కు కలిగిన ఆస్తిని వారి సంపూర్ణ హక్కుభుక్తములో అనుభవించుచున్నట్టి ఆస్తిని నా క్లయింటు క్రయం పొందుటకు ఒప్పందము చేసుకొనియున్నారు. కావున ఈ క్రింది షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనా ఏవిధమైన ఆక్షేపణలు, జప్తులు, తనఖాలు, సరిహద్దు తగాయిదాలు, అభ్యంతరములు, క్లయిములు ఏమయినా ఉన్నచో యీ ప్రకటన తేదీ నుండి 10 రోజులలోగా నాకు గాని నా క్లయింటుకు గాని, రిజిష్టరు పోస్టు తిరుగు రశీదు ద్వారా తెలియజేయవలసినది. తదుపరి వచ్చు అభ్యంతరములు నా క్లయింటును బైండు చేయజాలవు.

షెడ్యూలు: ఎన్.టి.ఆర్. జిల్లా విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి కార్యాలయ పరిధి, విజయవాడ నగరం, గాంధీనగరం, గరికపర్తివారి వీధిలో గల ఆస్తికి రెవెన్యూ నెం. 8, మున్సిపల్ వార్డు నెం. 17, NTS 899, డోర్ నెం: 26-7-20ఎ రు దాఖలా చ.గ. 137-40లు ఖాళీ నివేశ స్థలంకు హద్దులు. **తూర్పు:** పులిపాటి చినసుబ్బారావు ఆస్తి, **దక్షిణం:** రోడ్డు, **ఉత్తరం:** వేల్పూరు రావుకోటేశ్వరరావు, **పడమర:** గరికపర్తి వారి వీధి.

ఇట్లు, **పి. శేషుమోహన్,** అడ్వకేటు
గోపువారివీధి, గవర్నరుపేట, విజయవాడ–2
Cell No: 98485 26983

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
63036 11232

? నవరంగ్ థియేటర్ వద్ద కాట్రగడ్డవారి వీధి, కస్పావారి వీధిలో ద్విచక్రవాహనం వెళ్లడం చాలా కష్టంగా ఉంది. ట్రాఫిక్ నియంత్రించాలి. **- వీఎస్ రంగ శ్రీనివాస్**

✔ సమస్యను వెంటనే పరిష్కరిస్తాం

- మోహన్‌బాబు, ఏసీపీ, వీఎంసీ

? రామకృష్ణాపురం ఆంజనేయస్వామి గుడి వద్ద మంచినీటి పైపులైన్ మరమ్మతు కోసం తవ్వారు. తర్వాత వదిలేశారు. మరమ్మతులు పూర్తిచేసి రోడ్డు అంచులు సరిచేయాలి.

- బాపూజీ రాజు, స్థానికుడు

✔ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

- అరుణ్ దేవ్, ఏఈ, వీఎంసీ ,- న్యూస్‌టుడే, సీతారాంపురం

పోలీసుల విచారణ వేగవంతం

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు మహిళలపై ప్రభుత్వాసుపత్రి ఉద్యోగి హోంచిమెన్ అసభ్య ప్రవర్తన కేసుపై పోలీసులు విచారణను వేగవంతం చేశారు. హోంచిమెన్ కూడా అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని భార్యతో సదరు మహిళలపై ఫిర్యాదు చేయించారు. ఇరువర్గాల పరస్పర ఫిర్యాదులపై సీఐ చంద్రనాయక్ గురువారం రాత్రి విచారణ చేపట్టారు. వారి నుంచి వివరాలు సేకరించారు. ఏఎస్సై స్థాయి అధికారి ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. ఆయా ఫిర్యాదుల మేరకు ఇద్దరిపైనా కౌంటర్ కేసులు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.

ఎల్ఐసీ ఏజెంట్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : గవర్నర్‌పేట పెద్దిభొట్ల వారివీధిలోని ఎల్ఐసీ ఏజెంట్ కార్యాలయంలో అగ్నిప్రమాదం సంభవించింది. భవనం రెండో అంతస్తులోని గదిలో ఏజెంట్ గొట్టుముక్కల వరప్రసాద్ కార్యాలయం నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి మంటలు వ్యాపించి గది మొత్తం కాలిపోయింది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఎల్ఐసీకి సంబంధించిన పత్రాలు, కాగితాలు మాత్రమే ఉన్నాయి. ఇంకా నష్టం అంచనా వేయలేదు.

మద్యం అక్రమ విక్రయదారుడి అరెస్టు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : ఎలాంటి అనుమతులు లేకుండా ఉదయాన్నే అక్రమంగా మద్యం అమ్ముతున్న ఓ యువకుడిని సూర్యారావుపేట పోలీసులు గురువారం అరెస్టు చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన ఇట్టా దుర్గారావు (21) పెయింటర్‌గా పనిచేస్తుంటారు. ఆదాయం సరిపోక.. దుకాణాల్లో కొనుగోలు చేసిన మద్యాన్ని ఉదయం వేళ విక్రయిస్తున్నాడు. గురువారం మ్యూజియంరోడ్డులో అమ్ముతుండగా సూర్యారావుపేట పోలీసులు దాడులు చేసి అరెస్టు చేశారు. 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో కష్టపడాలి'

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థి గెలుపు కోసం ప్రజా ప్రతినిధులంతా కష్టపడి పనిచేయాలని ఆ పార్టీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు సూచించారు. గురువారం ఆంధ్రరత్నభవన్‌లో ఎమ్మెల్సీ రుహుల్లా, పూనూరు గౌతంరెడ్డి తదితరులతో కలిసి ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఈ ఎన్నికల్లో వైకాపాను గెలిపించుకోవాలని పేర్కొన్నారు. కార్పొరేటర్ శర్వాణిమూర్తి, నాయకులు యరగొర్ల శ్రీరాములు, ఆలంపూర్ విజయ్, కుక్కల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'కార్మికుల వేతనాల్లో భారీ కోత'


పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న బాబూరావు, సత్యబాబు

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : వరదల్లో ఇళ్లు మునిగి విధులకు హాజరుకాలేకపోయిన మున్సిపల్ కార్మికులకు వేతనాల్లో భారీ కోత పడిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సి.హెచ్.బాబూరావు, సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబులు పేర్కొన్నారు. గురువారం వారు న్యూరాజరాజేశ్వరీపేట, అజిత్‌సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బాబూరావు మాట్లాడుతూ.. వరదల వల్ల అనేక మంది కార్మికులు విధులకు హాజరు కాలేకపోయారని చెప్పారు. పలువురిని సస్పెండ్ చేస్తూ నోటీసులు ఇచ్చారని తెలిపారు. వరదల్లో కుటుంబ సభ్యులను వదిలేసి.. కార్మికులు విధుల్లో చేరి చెత్త తొలగింపులో నిరంతరం పని చేశారన్నారు. సెప్టెంబరు నెల వేతనాల్లో భారీ కోత పెట్టారని ఆరోపించారు. రూ.18వేలు రావాల్సిన వేతనం.. కొందరికి రూ.5వేలు/ రూ.6వేలు మాత్రమే వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐటీయూ విజ్ఞప్తి మేరకు పూర్తి వేతనం ఇస్తామని మంత్రి పి.నారాయణ హామీ ఇచ్చారని.. కానీ, దీనికి భిన్నంగా కోత విధించటం దారుణమన్నారు. వరద సమయంలో కష్టపడి పనిచేసిన కార్మికులకు ఒక నెల వేతనం అదనంగా ఇవ్వాలని, వారికి పూర్తి వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

పట్టభద్రులూ.. ఓటు నమోదు చేసుకోండి


ఓటు నమోదు పత్రాలు ఆవిష్కరిస్తున్న సాంబశివరావు, కృష్ణమోహన్, రమణారావు తదితరులు

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రులు తమ ఓటును ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెదేపా రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గంటా కృష్ణమోహన్‌లు పిలుపునిచ్చారు. గురువారం అజిత్‌సింగ్‌నగర్‌లోని తెదేపా సెంట్రల్ కార్యాలయంలో పట్టభద్రుల ఓట్ల నమోదు పత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రులైన వారు ఓటు వేయవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పేర్లను నమోదు చేసుకుని మంచి వ్యక్తిని శాసనమండలికి పంపించాలని కోరారు. కూటమి ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఓటు నమోదు కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎరుబోతు రమణారావు, కంచి ధనశేఖర్, పైడి శ్రీను, పిరియ సోమేశ్వరరావు, లబ్బ వైకుంఠం, కొమ్మినేని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సార్ఆర్‌లో 'స్వచ్ఛతా హీ సేవ'


మొక్కలు నాటుతున్న విద్యార్థులు, చిత్రంలో శిరీష, అధ్యాపకులు

మాచవరం, న్యూస్‌టుడే: స్థానిక ఎస్సార్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'స్వచ్ఛతా హీ సేవ'లో భాగంగా గురువారం క్యూర్ ఇంటర్నేషనల్ ఇండియా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రాంగణంలో 40 మొక్కలు నాటినట్లు ప్రిన్సిపల్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. వాటిని సంరక్షించే బాధ్యత విద్యార్థులు తీసుకోవాలని ఆమె సూచించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త కె.రమేష్, వ్యాయామ విద్యావిభాగాధిపతి డి.యుగంధర్, అధ్యాపకులు, ట్రస్టు నిర్వాహకులు శిరీష, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న హరిబాబు, రంగారావు తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: చుట్టుగుంటలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ సమాఖ్య(ఎస్‌జీఎఫ్) అండర్-19 తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారని డీన్ గుంటూరు హరిబాబు తెలిపారు. ఈ నెల 4, 5వ తేదీల్లో కడప జిల్లా రైల్వేకోడూరులో నిర్వహించే ఈ పోటీల్లో ఎం.శ్యామ్‌కుమార్, టి.కృతిక, ఎం.భానుప్రియలు ఎంపికైనట్లు చెప్పారు. గురువారం వారిని ప్రిన్సిపల్ నిజాంపట్నం గోకర్ణేశ్వరరావు, ఏజీఎం కొమ్మినేని రంగారావు, శాప్ కోచ్ గౌరీశంకర్, జిల్లా తైక్వాండో సంఘం కార్యదర్శి ఎం.అంకమ్మరావులు అభినందించారు.

'రాజకీయ లబ్ధి కోసమే సనాతన ధర్మం'

గాంధీనగర్, న్యూస్‌టుడే : రాజకీయ లబ్ధి కోసమే సనాతన ధర్మం అంటూ కొన్ని రాజకీయ పార్టీలు ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించడం సరికాదని బౌద్ధ రచయిత బి.గోవర్ధన్ అన్నారు. దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సనాతన ధర్మం అనే పదానికి కొత్త భాష్యం చెబుతూ.. ఉద్యమాలు చేయాలని రాజకీయ పార్టీలు పిలుపునివ్వడం దుర్మార్గమన్నారు. సనాతన ధర్మం అనే పదానికి వ్యతిరేకంగా జాతీయోద్యమ స్వాతంత్ర్య పోరాటం జరిగిందని గుర్తు చేశారు. ప్రతి మనిషి సమానమే అనే నినాదంతో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. సనాతన ధర్మంపై రాజకీయ నాయకులు చేస్తున్న కుట్రలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, అక్కినేని వనజ, గోలి సీతారామయ్య, కరవది సుబ్బారావు, సి.హెచ్.కోటేశ్వరరావు, బుట్టి రాయప్ప, అక్కినేని చంద్రరావు, పరిశపోగు రాజేష్, ఆంధ్ర మాల్యాద్రి, కె.రాజశేఖర్, తాతారావు, జీవీ రాజు, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడికి గాయాలు

మధురానగర్, న్యూస్‌టుడే : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు గాయపడ్డాడు. గుణదల పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భానునగర్‌కు చెందిన పేకేటి తాతారావు (75) బుధవారం రాత్రి బి.ఆర్.టి.ఎస్. రోడ్డులో రోడ్డు దాటుతున్నారు. గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వృద్ధుని కుమారుడు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లయన్స్ క్లబ్ వితరణ


దుప్పట్లు, దిండ్లు పంపిణీ చేస్తున్న హజరత్తయ్య గుప్తా, రామకృష్ణ, రవీంద్ర, గుప్తా

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే: కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునేందుకు లయన్స్ క్లబ్బులు ఎపుడూ ముందుంటాయని జిల్లా అంబాసిడర్ వేముల హజరత్తయ్య గుప్తా పేర్కొన్నారు. గురువారం ప్రకాష్‌నగర్ చర్చిలో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యంలో 50 మంది వరద బాధితులకు దుప్పట్లు, దిండ్లు, చాపలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పి.రామకృష్ణ, ఎం.రవీంద్ర, కోశాధికారి ఎన్.వి.ఎల్.ఎన్.గుప్తా తదితరులు పాల్గొన్నారు.


మంగళకరం.. పంచహారతుల వీక్షణం

హిందూ సంప్రదాయంలో హారతికి ఎంతో ప్రాధాన్యం ఉంది. మనం చేసే పూజలు ఫలించాలంటే ఇది తప్పనిసరి. ఒకవేళ ఇవ్వకపోతే అసంపూర్ణంగా భావిస్తారు. అలాంటిది ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను స్తుతిస్తూ రుత్విక్కులు నిత్యం పంచహారతులను సమర్పిస్తారు. సమస్త లోకం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకుంటూ వీటిని ఇస్తారు. హారతి వలన మంగళం కలుగుతుందని భక్తుల నమ్మకం. దసరా వేడుకల్లో వివిధ రూపాల్లో ఉన్న జగన్మాత దుర్గమ్మకు వీటిని కనుల పండువగా ఇస్తారు. వీటిని తిలకించేందుకు రెండు కళ్లు సరిపోవంటే అతిశయోక్తి కాదు. – ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే



అన్ని మంత్రాలకు మూలం ఓంకారం

సాయం సంధ్యవేళ నివేదన అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ ఓంకార హారతి ఇస్తారు. అన్ని మంత్రాలకు మూలం ఓంకారం. ఓంకార రూపాన్ని వీక్షించడంతో సమస్త పాపాలు తొలగిపోతాయన్నది భక్తుల విశ్వాసం.



అన్ని నక్షత్ర రాశుల వారికి..

పంచహారతుల్లో చివరిది నక్షత్ర హారతి. సకల నక్షత్ర రాశుల వారి వీక్షణార్థం ఈ హారతిని అమ్మవారికి సమర్పిస్తారు. 27 నక్షత్రాల్లో జన్మించిన వారి రాశి ఫలాలతో సంబంధం లేకుండా వీక్షిస్తే ప్రయోజనం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం.

దీర్ఘాయువును ప్రసాదించే నాగదేవత

పంచహారతుల్లో రెండవది నాగ హారతి. దేవతా స్వరూపమైన నాగ సర్పం దీర్ఘాయువుకు పవిత్రతకు ప్రతీక. నాగ హారతిని దర్శించడం వలన సకలరోగాలు నివారించబడతాయని భక్తుల నమ్మకం. దీంతోపాటు సర్పదోషాలు తొలగిపోతాయి.





భూమండలాన్ని రక్షించే కుంభహారతి

పంచహారతుల్లో నాల్గోది కుంభ హారతి. సమస్త భూమండలాన్ని రక్షించే ఈ హారతిని తిలకించడంతో జీవ రక్షణ లభిస్తుంది. సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడుతుంది. భక్తులకు అనన్యమైన పుణ్యం సిద్ధిస్తుంది.

పరమేశ్వరుని పంచముఖాలకు ప్రతిరూపం

జగన్మాత దుర్గమ్మకు ఇచ్చే మహిమాన్వితమైనది పంచహారతి. పరమేశ్వరిని పంచముఖాలకు ప్రతిరూపంగా దీన్ని భావిస్తారు. ఈ హారతిని వీక్షిస్తే భక్తులకు పంచ మహాపాతకాలు తొలగుతాయి. పంచప్రాణాలకు సాంత్వన కలుగుతుంది. దుర్గామల్లేశ్వర స్వామి వార్ల సంపూర్ణ అనుగ్రహం



కలుగుతుందని భక్తుల నమ్మకం.

ఇంద్రకీలాద్రిపై వైభవంగా దసరా ఉత్సవాలు ప్రారంభం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై అంగరంగ వైభవంగా దసరా ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మూలవిరాట్ దుర్గమ్మకు శాస్త్రోక్తంగా స్నపనాభిషేకం రుత్విక్కులు నిర్వహించారు. అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని యాగశాలలో కలశ ప్రతిష్ఠ నిర్వహించిన అనంతరం ఉదయం 9 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతించారు. అమ్మవారికి ప్రీతి పాత్రమైన బాల పూజను మల్లికార్జున మహామండపంలో ఆరో అంతస్తులో నిర్వహించారు. అప్పటికే క్యూలైన్లు భక్తులతో కిటకిట లాడాయి. కెనాల్ రోడ్డు వినాయకుడి గుడి నుంచి క్యూలైన్లో ప్రవేశించిన భక్తులు దుర్గగుడి టోల్‌గేటు నుంచి ఘాట్ రోడ్డు మీదుగా అమ్మవారిని దర్శించుకున్నారు. మల్లేశ్వరస్వామి దర్శనం చేసుకున్న అనంతరం భక్తులు మెట్ల మార్గంలో కనకదుర్గానగర్‌కు చేరుకున్నారు.



కుంకుమ పూజలో భక్తులు

ఆర్జిత సేవల సందడి..

జగన్మాత దుర్గమ్మకు ఆర్జిత సేవలు నిర్వహించారు. మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో రెండు విడతలుగా దుర్గమ్మ ఉత్సవమూర్తి వద్ద రుత్వికులు ప్రత్యేక కుంకుమార్చన చేశారు. ఆర్జిత సేవలో 300 మంది మహిళలు అమ్మవారి రూపునకు కుంకుమ పూజ చేశారు. అనంతరం వీరిని ప్రత్యేక క్యూలైనులో అమ్మవారి దర్శనానికి పంపారు. వేకువ జామున ప్రత్యేక ఖడ్గమాలార్చన, రాజగోపుర ప్రాంగణంలో శ్రీచక్రనవావరణార్చన, యాగశాలలో ప్రత్యేక చండీహోమంలో ఉభయదాతలు పాల్గొన్నారు.

❖ దుర్గమ్మ దర్శనం చేసుకున్న భక్తులు మల్లేశ్వరాలయం మెట్ల మార్గం మీదుగా అన్నప్రసాద పంపిణీ కేంద్రానికి చేరుకొని ప్రసాదాన్ని స్వీకరించారు. మల్లేశ్వరాలయ మెట్ల మార్గం వద్ద భక్తుల రద్దీ కనిపించింది. రానున్న రోజులను దృష్టిలో ఉంచుకొని అన్నప్రసాదానికి ఆటంకం లేకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తామని పోలీసు అధికారులు తెలిపారు.

నేటి అలంకారం

4-10-2024, శుక్రవారం

శ్రీ గాయత్రీ దేవి



"ఓం బ్రహ్మాస్త్రకుండికాస్తాం శుద్ధ జ్యోతి స్వరూపిణీం సర్వతత్త్వమయీం వందే గాయత్రీం వేదమాతరం"

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో రెండో రోజు జగన్మాత దుర్గమ్మను వేదమాత గాయత్రీదేవిగా అలంకరిస్తారు. పంచముఖాలతో దర్శనమిచ్చే సంధ్యావందన అధిష్ఠాన దేవతగా అమ్మవారిని కొలుస్తారు. కొబ్బరిఅన్నాన్ని నివేదనగా సమర్పిస్తారు. సకల మంత్రాలకు, వేదాలకు మూలమైన దేవతగా గాయత్రీదేవి ప్రసిద్ధి. మహత్తర శక్తిగల జగన్మాత ఐదు ముఖాలతో వరదాభయ హస్తాలు ధరించి కమలాసనాసీనురాలిగా నేడు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

భక్తులకు సౌకర్యాలు బాగా కల్పించారు

❖ దసరా ఏర్పాట్లకు దేవాదాయ శాఖ మాజీ మంత్రి కితాబు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాలను పురస్కరించుకొని చేసిన ఏర్పాట్లు బాగున్నాయని దేవాదాయ శాఖ మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. దసరా శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకొని గురువారం బాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మను ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలని ప్రజలు సుఖశాంతులతో విరాజిల్లాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఇప్పుడు కూడా భక్తులకు సౌకర్యాలు బాగా కల్పించారన్నారు. భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున మరింత మెరుగ్గా అధికారులు పనిచేస్తారని ఆకాంక్షించారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రసాదాల పోటు, అన్నదాన భవనం, క్యూలైన్లు అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు.



మాట్లాడుతున్న దేవాదాయ శాఖ మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

సామాన్యులకు చక్కటి దర్శనం అందించడమే లక్ష్యం

❖ దేవాదాయశాఖ మంత్రి రామనారాయణరెడ్డి



అమ్మవారి సన్నిధిలో దేవాదాయశాఖ మంత్రి రామనారాయణరెడ్డి, సమాచారశాఖ మంత్రి పార్థసారథి



హోం మంత్రి అనితకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న వేదపండితులు

విజయవాడ(చిట్టినగర్), న్యూస్‌టుడే : సామాన్య భక్తులు ఇబ్బంది పడకుండా అమ్మవారి దర్శనం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. దేవీశరన్నవరాత్రుల ఉత్సవాల్లో గురువారం శ్రీబాలా త్రిపురసుందరీదేవి అలంకారంలో అమ్మవారిని తొలి దర్శనం చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ఇంద్రకీలాద్రిపై ఉత్సవాల ఏర్పాట్లు వైభవంగా చేశామన్నారు. అన్ని శాఖల సమన్వయంతో ఈ ఉత్సవాలను విజయవంతం చేస్తామన్నారు. ప్రతి భక్తుడికి అన్న ప్రసాదం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు. అమ్మవారి జన్మనక్షత్రమైన మూలా నక్షత్రం సందర్భంగా ఈ నెల 9న తేదీన మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబసమేతంగా వచ్చి పట్టు వస్త్రాలు సమర్పిస్తారన్నారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, సమాచార శాఖ మంత్రి పార్థసారథి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.విజయ్ తొలిరోజు అమ్మవారిని దర్శించుకున్నారు.



ఎమ్మెల్యే సుజనా చౌదరికి అమ్మవారి చిత్రం పటం అందజేత

56 మందితో ఉత్సవ కమిటీ

విద్యాధరపురం, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం 56 మందితో సేవా కమిటీని ఏర్పాటు చేస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. కమిటీలో తెదేపా, జనసేన, భాజపాలకు చెందిన నాయకులు, ట్రస్టుబోర్డు మాజీ సభ్యులు ఉన్నారు.

అమ్మవారి పేరుతో ప్రత్యేక రైలు నడపాలి

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : దేశంలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రాలకు ఆయా క్షేత్రాలు, దేవతామూర్తుల పేర్లతో రైళ్లు నడుపుతున్న నేపథ్యంలో విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారు, ఇంద్రకీలాద్రి పేర్లతో ఒక రైలు నడపాలని ఏపీసీసీ ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ రైల్వే జీఎంకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రాష్ట్ర ఎంపీలతో నిర్వహించనున్న సమావేశంలో ఎంపీలంతా ఈ విషయాన్ని జీఎం ముందు ప్రస్తావించాలని కోరారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండండి



కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖర్‌బాబు

విద్యాధరపురం, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల విధుల్లో ప్రతి సెక్టారులోని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నగర పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు ఆదేశించారు. ఇంద్రకీలాద్రి పరిసర ప్రాంతాల్లో వివిధ సెక్టార్లలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును జిల్లా కలెక్టర్ సృజన, ఏడీసీపీలతో కలిసి క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలన చేశారు. కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద సిబ్బందికి అందజేసిన భోజనాల నాణ్యత ఏ విధంగా ఉందో తెలుసుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా సిబ్బంది వ్యవహరించాలన్నారు. సమస్యలు తలెత్తినప్పుడు సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సీసీ కెమెరాల్లో ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి పరిస్థితిని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

సౌకర్యాలపై నిరంతర పర్యవేక్షణ

చిట్టినగర్, న్యూస్‌టుడే : భక్తులకు కల్పించే సౌకర్యాలపై నిరంతర పర్యవేక్షణ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. దసరా ఉత్సవాల తొలి రోజు గురువారం అమ్మవారిని కలెక్టర్ దర్శించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడారు. ప్రతిరోజూ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు లక్షకు పైగా వస్తారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులకు, వృద్ధులకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు దర్శన సమయం కేటాయించామన్నారు. ఆ సమయంలో వచ్చి దర్శనం చేసుకోవాలని సూచించారు. వీఐపీలను ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు అనుమతిస్తామన్నారు. అవసరం మేర చిన్న చిన్న మార్పులు చేస్తూ మెరుగైన సేవలు అందిస్తూ ఉత్సవాలను విజయవంతం చేస్తామని చెప్పారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సృజన

బోగస్ సంస్థలతో జీఎస్టీ ఎగవేత

(మొదటి పేజీ తరువాయి)

ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ రూపంలో లబ్ధి పొందుతున్నారు. ఏవేవో ఆధార్ కార్డు వివరాలను దరఖాస్తులో నమోదు చేస్తున్నారు. కొన్నిచోట్ల యజమానులకు తెలియకుండా వారి దుకాణాల్లో వ్యాపారసంస్థలు నిర్వహిస్తున్నట్లు ఆధారాలు సమర్పిస్తున్నారు. అనుమతులు జారీచేశాక వీటి కార్యకలాపాలపై వాణిజ్యపన్నుల శాఖ పర్యవేక్షణ ఉండట్లేదు. తనిఖీల సమయంలోనే కొన్ని అక్రమాలు బయటపడుతున్నాయి. సర్కిళ్ల పరిధిలో కాకుండా.. సెంట్రల్ రిజిస్ట్రేషన్ యూనిట్ ద్వారా అనుమతులు జారీకావడంతో ఎవరి పర్యవేక్షణా ఉండట్లేదు. సులభతర వాణిజ్య విధానంలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అధికారులు రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. నిర్ణీత వ్యవధిలో అనుమతులు ఇవ్వకపోతే ఆటోమేటిక్‌గా రిజిస్ట్రేషన్ అయిపోతుంది. ఈ క్రమంలో దరఖాస్తుల్లోని వివరాల పరిశీలనకు వీలు ఉండట్లేదు. రిజిస్ట్రేషన్ జరిగాక... కొన్ని నెలల తర్వాత భారీగా ఇన్వాయిస్‌లు జారీ అయినట్లు గుర్తించాక గానీ అక్రమాలు జరిగినట్లు తెలియదు.

613 వ్యాపార సంస్థలను పరిశీలిస్తే 53 తూచ్

మలివిడత తనిఖీలలో రాష్ట్రంలో ఇటీవల వరకు 613 వ్యాపారసంస్థల లావాదేవీలు పరిశీలించగా.. 53 మనుగడలో లేవు. దాంతో 41 రిజిస్ట్రేషన్లను సస్పెండ్ చేశారు. 12 రిజిస్ట్రేషన్లను రద్దుచేశారు. సుమారు రూ.5కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ లావాదేవీలు జరగకుండా బ్లాక్ చేశారు.

అమరావతిలో సివిల్ సర్వీసెస్ శిక్షణ కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

వారిని గుర్తించి, నైపుణ్యం పెరిగేలా శిక్షణ ఇచ్చి ఆదరణ, ఇతర రాయితీ రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అర్హులను ఎంపిక చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల కావడానికి ముందు నుంచే బీసీ స్టడీ సర్కిళ్లలో నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తాం' అని తెలిపారు.

తెల్లారేసరికి.. తుడిచిపెట్టేసేలా!

(మొదటి పేజీ తరువాయి)

చర్యలపై చేష్టలుడిగి చూస్తోంది.

ఒక్క రోజులో 25 సెం.మీ. వాన

24 గంటల్లో 20 సెం.మీ వర్షం కురిస్తే.. అమ్మో కుంభవృష్టి అనేవాళ్లం. ఇప్పుడు ఒక్క రోజులో 25 సెం.మీ. వర్షం అనేది సాధారణంగా తయారైంది. మారుతున్న వాతావరణ పరిస్థితులతో చాలాచోట్ల అతి, అత్యంత భారీ వర్షాలే నమోదవుతున్నాయి. గంట వ్యవధిలో 6 నుంచి 10 సెం.మీ. వర్షం కురుస్తున్న పరిస్థితులూ ఉన్నాయి. అది ఒకటి, రెండు ప్రాంతాలకే పరిమితమైతే వరద ప్రవాహం తక్కువే ఉంటుంది. కానీ వందల కిలోమీటర్ల విస్తృతిలో అత్యంత భారీగా వానలు కురుస్తుండటంతో వరదలు పోటెత్తి ఊరూ వాడా తేడా లేకుండా ముంచెత్తుతున్నాయి.

■ తెలంగాణలోని ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో.. సుమారు వంద కిలోమీటర్లకు పైగా విస్తృతిలో అత్యంత భారీ వర్షాలు కురిశాయి. ఏకంగా 30 ప్రాంతాల్లో 25 సెం.మీ నుంచి 53 సెం.మీ వర్షం కురిసింది. అదే సమయంలో పొరుగునున్న ఎన్టీఆర్ జిల్లాలోనూ కుండపోత వానలు కురిశాయి. ఫలితంగానే మునేరు, బుడమేరుకు వరద పెరిగింది.

■ మిగ్‌జాం తుపాను సమయంలో గతేడాది డిసెంబరు 2 నుంచి 5వ తేదీ ఉదయం 8.30 గంటల వరకు అంటే మూడు రోజుల్లో తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలే కురిశాయి. పెళ్లకూరు, నాయుడుపేట, బుచ్చినాయుడుకండ్రిగ, చిల్లకూరు, నెల్లూరు అర్బన్, కోట తదితర 12 మండలాల్లో 50 సెం.మీ. పైగా వర్షం కురిసింది. ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోనూ అప్పట్లో 24 గంటల్లోనే 25 సెం.మీ పైగా కురిసింది. తుపాన్లు, ద్రోణుల ప్రభావంతో అత్యంత భారీవర్షాలు కురిసే ప్రాంతాలే ఎక్కువగా ఉంటున్నాయి.



అల్లూరి సీతారామరాజు జిల్లా బంధవీధి వద్ద పొలాల్లోకి కొట్టుకొచ్చిన రాళ్లకుప్పలు, చెట్లు

ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తేనే..

విరుచుకుపడుతున్న విపత్తులను ఎదుర్కోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధతా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి. మన్యంలో అత్యంత భారీ వర్షాలతో ప్రజల జీవనమే ప్రశ్నార్థకంగా తయారవుతోంది. ఏ రాత్రి ఎటు నుంచి మట్టి, రాళ్లు, చెట్లతో కూడిన వరద ముంచెత్తుతుందో అనే భయాందోళనల మధ్య జనం బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. కొండ ప్రాంతాల్లో ఎంత వర్షం కురుస్తుందో గుర్తించే పరిస్థితి లేదు. తెలుసుకునేలోగానే వరద ముంచేస్తోంది. పట్టణ, నగర ప్రాంతాల్లో కొండలపై ఇళ్లు కట్టుకున్న వారికీ వాన కురుస్తుందంటే గుండె దడే! రాష్ట్ర ప్రభుత్వం నదీ పరీవాహకాలతోపాటు.. మైదాన, కొండ ప్రాంతాల్లోనూ వర్షపాతాన్ని గుర్తించి తక్షణమే అప్రమత్తం చేసే వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. విపత్తు సమయాల్లో వారికి తక్షణ సహాయం అందించేలా చూడాలి.

మూడేళ్లలో రూ. 3,761 కోట్లు.. దేనికి ఖర్చయ్యాయో?

పెరుగుతున్న విపత్తుల నేపథ్యంలో ఆర్థిక సంఘం సూచనల మేరకు కేంద్రం రాష్ట్రాలకు ఎస్‌డీఆర్‌ఎఫ్ కింద నిధుల్ని కేటాయిస్తుంది. ఇందులో కేంద్రం 75%, రాష్ట్రం 25% భరిస్తాయి. 2021-22 నుంచి 2025-26 వరకు ఆంధ్రప్రదేశ్‌కు రూ.6,591 కోట్లు కేటాయించారు. 2021-22 నుంచి 2023-24 వరకు రూ.3,761 కోట్లు అందాయి. వివిధ రకాల విపత్తుల్ని ఎదుర్కొనేందుకు ఈ నిధుల్ని వినియోగించుకోవచ్చు. కానీ గత ప్రభుత్వంలో దేనికి ఖర్చు చేశారో లెక్కలూ చెప్పలేని పరిస్థితి.



అల్లూరి సీతారామరాజు జిల్లా చెల్లనిశిల్ప వద్ద నర్సీపట్నం– భద్రాచలం ప్రధాన రహదారిపై పెద్దఎత్తున విరిగిపడిన కొండచరియలు, పేరుకుపోయిన మట్టి

అమరావతి నుంచి పోర్టుకు జలమార్గం

ప్రతిపాదనపై సీఎం సానుకూలత: మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: రాజధాని అమరావతి నుంచి బందరు పోర్టుకు జలమార్గం ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు గనులు, ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. మచిలీపట్నంలో గురువారం ఆయన నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇన్‌లాండ్ వాటర్ వేస్ అభివృద్ధి కింద అమరావతి నుంచి నేరుగా పోర్టు వరకూ కాలవ ద్వారా రవాణా సౌకర్యం కల్పించే ప్రతిపాదనకు ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలత వ్యక్తం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న బందరు కాలవను అవసరం మేరకు అభివృద్ధి చేసి బందరు వద్ద అనుసంధాన కాలవను నిర్మిస్తే జలమార్గం సిద్ధం అవుతుందన్నారు. బుధవారం మచిలీపట్నం వచ్చిన చంద్రబాబు నగర అభివృద్ధితో పాటు, పోర్టు పనులు వేగవంతం చేసేందుకు ఆదేశాలు ఇచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. షెడ్యూల్‌లో లేకపోయినా పోర్టు పనులను సందర్శించడం ద్వారా ముఖ్యమంత్రి మచిలీపట్నం నుంచే ఆకస్మిక తనిఖీలకు నాంది పలికారన్నారు. 300 ఎకరాలకు పైగా ఆస్తులున్న ఆంధ్రా జాతీయ కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోనుందన్నారు. స్వాతంత్రోద్యమ సమయంలో ప్రముఖులైన ముట్నూరి కృష్ణారావు, కోపల్లె హనుమంతరావు, డాక్టర్ భోగరాజు పట్టాభిసీతారామయ్యలు ప్రజా సహకారంతో కళాశాలను ఏర్పాటు చేస్తే ముంబయి నటి జత్వాని కాదంబరి కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి అక్రమంగా కళాశాల ఆస్తులు అనుభవిస్తున్నారన్నారు. ప్రజలకు చెందాల్సిన ఆస్తి అన్యాక్రాంతం అవడంపై దీర్ఘకాలంగా పోరాటం చేస్తూనే ఉన్నామని, తాజాగా చంద్రబాబు హామీతో త్వరలో ఇవి ప్రభుత్వపరం కానుందన్నారు. ఈ కళాశాలలో గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. రోల్డ్ గోల్డ్ పరిశ్రమకు సంబంధించి ఎంఎస్ఎంఈ క్లస్టర్ల ద్వారా అభివృద్ధి చేయడంతో పాటు డిజైనింగ్‌లో నైపుణ్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. చిరకాల వాంఛగా ఉన్న మచిలీపట్నం-రేపల్లె రైల్వేలైన్ ఏర్పాటుకు అడుగులు ముందుకు పడుతున్నాయన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, పాషా తదితరులు పాల్గొన్నారు.

వియత్నాంకు విమాన సర్వీసు నడపాలి

ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్

ఈనాడు, అమరావతి: రాష్ట్రం నుంచి వియత్నాంకు విమాన సర్వీసు నడపాలని వియట్‌జెట్ ఎయిర్ సీఈవోకు ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ తరఫున లేఖ రాసినట్లు ఆ సంఘం అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు ఓ ప్రకటనలో తెలిపారు. 'తృణధాన్యాలు, పప్పు దినుసులు, ఫుడ్ ప్రాసెసింగ్, రొయ్యల పెంపకం, సుగంధద్రవ్యాలు, పత్తి, ఆటో కాంపోనెంట్స్, బల్క్ ఫార్మా ఔషధాల ఉత్పత్తిలో రాష్ట్రానికి గుర్తింపు ఉంది. వాటిని దిగుమతి చేసుకొని విలువ జోడించిన తర్వాత ఇతర దేశాలకు వియత్నాం ఎగుమతి చేస్తుంది. రాష్ట్రం నుంచి పెద్దసంఖ్యలో విద్యార్థులు వియత్నాంలో మెడిసిన్, అగ్రిఫార్మింగ్‌లలో ఉన్నత విద్య అభ్యసిస్తున్నారు. చౌక పర్యాటక ప్రదేశంగా వియత్నాంకు గుర్తింపు ఉంది. విశాఖ, విజయవాడల్లో ఏదో ఒక చోట నుంచి వారంలో రెండు విమాన సర్వీసులను నేరుగా వియత్నాంకు నడిపితే వెసులుబాటుగా ఉంటుంది' అని లేఖలో పేర్కొన్నారు.

ఆప్ సి-జోన్ సమన్వయకర్తగా నేతి మహేశ్వరరావు

ఈనాడు డిజిటల్, అమరావతి: ఆమ్ ఆద్మీ పార్టీ కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల (సి-జోన్) సమన్వయకర్తగా నేతి మహేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ ఎస్.రమేశ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పోలవరం పనులపై సుదీర్ఘ సమీక్ష

● ప్రాజెక్టును సందర్శించిన సీఈఓ అతుల్ జైన్



ఎగువ కాఫర్ డ్యాం వద్ద ప్రాజెక్టు ఇన్‌ఛార్జి సీఈతో మాట్లాడుతున్న అతుల్‌జైన్

పోలవరం, న్యూస్‌టుడే: రెండ్రోజుల పర్యటనలో భాగంగా పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈఓ అతుల్ జైన్ ప్రాజెక్టు పనుల స్థితిగతులను గురువారం తెలుసుకున్నారు. స్పిల్‌వే, గైడ్ బండ్, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు, గ్యాప్-1, 2, 3లను పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. అనంతరం క్యాంపు కార్యాలయానికి చేరుకొని ప్రాజెక్టు కుడి వైపు జరిగిన అనుబంధ పనులు, జంట సొరంగాలు, రెగ్యులేటర్లు, బండ్-1, 2లను పరిశీలించారు. జలవనరులశాఖ అధికారులు, గుత్తేదారు, వాప్కోస్ ప్రతినిధులతో సుదీర్ఘంగా సమీక్షించారు. అనంతరం రాజమహేంద్రవరం బయలుదేరి వెళ్లారు. శుక్రవారం అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని పునరావాస కాలనీలను సీఈఓ సందర్శించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయన వెంట పోలవరం ప్రాజెక్టు ఇన్‌ఛార్జి సీఈ కె.నరసింహమూర్తి, పీపీఏ సీఈ రాజేశ్‌కుమార్, ఈఈలు పి.సుధాకరరావు, పి.వెంకటరమణ, పలువురు డీఈలు న్నారు. సీఈఓ పర్యటనను పురస్కరించుకుని కవరేజ్ కోసం వెళ్లిన మీడియాను ప్రాజెక్టు ప్రాంతంలోకి అనుమతి లేదంటూ ఎస్పీఎఫ్ పోలీసులు స్థానిక చెక్‌పోస్టు వద్ద నిలిపేశారు.